విశాల భారతి
తెలుగు దినపత్రిక
01-03-2026
www.vishalabharati.com
epaper.vishalabharati.com
ఆదివారం, హైదరాబాద్
సంపుటి:4 సంచిక: 57

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ

- అజ్మేర్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- 14-15 ఏళ్ల లోపు 1.15 కోట్ల మంది బాలికలకు ఉచితంగా టీకాలు
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే ప్రధాన లక్ష్యం
- 'స్వస్థ నారి' విజన్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'గార్డాసిల్' లభ్యం
- వేల రూపాయల ఖరీదైన వ్యాక్సిన్ ఇకపై సామాన్యులకు అందుబాటులోకి
- ఏటా 1.2 లక్షల కొత్త కేసుల నమోదు నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం



**విశాలభారతి, జాతీయం:**

భారతీయ సమాజంలో మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యానికి మూలమని నమ్మే కేంద్ర ప్రభుత్వం, మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. రాజస్థాన్‌లోని అజ్మేర్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. మహిళల్లో ప్రాణాంతకంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలనే సంకల్పంతో ఈ బృహత్తర యజ్ఞాన్ని చేపట్టారు. దేశంలోని ప్రతి ఆడబిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ప్రధాని ఆకాంక్షించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ముఖ్యంగా 14, 15 ఏళ్ల వయస్సు గల బాలికలను లక్ష్యంగా చేసుకుని రూపొందించబడింది. ఇందులో భాగంగా 'గార్డాసిల్' అనే శక్తివంతమైన టీకాను దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 1.15 కోట్ల మంది బాలికలకు ఈ రక్షణ కవచాన్ని అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవ వల్ల భవిష్యత్తులో వేలాది మంది మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమంపై స్పందిస్తూ, ఆడబిడ్డల సంక్షేమం కోసం

మిగతా 2లో..

# కోకాపేట భూములు శారదా పీఠానికే



కోకాపేట శారదా పీఠం భూములపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు

- పీఠం భూముల్లో జలమండలి నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేత
- జలమండలికి గతంలో చేసిన భూకేటాయింపులను రద్దు చేసిన ప్రభుత్వం
- పూర్తి సమాచారం ఇవ్వని అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం
- పీఠం ప్రతినిధుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి
- భూములు తిరిగి శారదా పీఠానికే దక్కేలా అధికారులకు దిశానిర్దేశం

03

# 21 భారీ పేలుడు.. మంది మృతి!

## వేట్లపాలెం సమీపంలో పేలిన బాణసంచా తయారీ కేంద్రం

## 21 మంది దుర్మరణం.. చెల్లాచెదురుగా పడిన శరీర భాగాలు

- మృతుల్లో ఎక్కువ మంది మహిళా కూలీలేనని గుర్తింపు
- విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు; హోంమంత్రి రాక
- క్షతగాత్రులకు కాకినాడ, సామర్లకోటలో మెరుగైన వైద్యం
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల ఆరా.. పరారీలో యజమాని

కాకినాడ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారులోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన భారీ విస్ఫోటనం 21 మంది నిండు ప్రాణాలను బలితీసుకుంది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా సంభవించిన ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతమంతా శ్మశానవాటికను తలపించింది. అప్పటివరకు కష్టపడి పనిచేస్తున్న కూలీలు క్షణాల వ్యవధిలోనే అగ్నికి ఆహుతయ్యారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విస్ఫోటనం ఎంత తీవ్రంగా ఉందంటే, మృతదేహాలు తునకలై గాలిలోకి ఎగిరి సమీపంలోని వరి పొలాల్లో చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనతో జిల్లా వ్యాప్తంగా దిగ్భ్రాంతి అలుముకుంది. ఈ ప్రమాదం జరిగిన తీరు స్థానికులను భీతావహానికి గురిచేసింది. అడబాల వీరబాబు అనే వ్యక్తి వరిపొలాల మధ్య జనావాసాలకు దూరంగా, ఎవరూ సులభంగా రాలేని ప్రాంతంలో ఈ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ నిత్యం 25 నుండి 30 మంది కార్మికులు పనిచేస్తుంటారని, అందులో అత్యధికంగా మహిళలే ఉన్నారని తెలుస్తోంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ శబ్దంతో పేలుళ్లు

మిగతా 2లో..





## బాత్ రూమ్‌లో ప్రసవించిన ఇంటర్ విద్యార్థిని


- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో దిగ్భ్రాంతికర ఘటన
- ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాస్తూ బాత్‌రూమ్‌కు వెళ్లిన బాలిక
- అక్కడే ప్రసవించిన వైనం.. బాత్‌రూమ్ బేసిన్‌లో మృతశిశువు గుర్తింపు
- ఎంతకూ రాకపోవడంతో వెళ్లి చూసిన ఇన్విజిలేటర్లకు అసలు విషయం వెల్లడి
- బాలికను హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పాల్వంచ పోలీసు యంత్రాంగం

03

## భానుడి భగభగ.. కరెంటు ధగధగ

- మార్చి రాకముందే ఎండల తీవ్రత.. భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో శనివారం 6,057 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- ఫిబ్రవరిలోనే గత ఏడాది మార్చి రికార్డులను అధిగమించిన వినియోగం
- వేసవి సవాళ్లను ఎదుర్కొనేందుకు 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి అదనంగా 366 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

02



## ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం

- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో అంతర్జాతీయ సమాజం ఆందోళన
- ప్రాంతీయ ఘర్షణలు తీవ్రమయ్యే ముప్పు ఉందంటూ ఐరోపా హెచ్చరిక
- అంతర్గత అత్యవసర భద్రతా సమావేశాలు నిర్వహించిన యూరోపియన్ దేశాలు
- ఏకపక్ష దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రష్యా, మలేసియా, పాకిస్థాన్
- ఐరాస భద్రతామండలి అత్యవసర సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు పిలుపు
- చర్చల ద్వారానే శాంతి సాధ్యమంటూ అంతర్జాతీయ నేతల ఉద్ఘాటన

02






## టీనేజర్లలో ఇన్‌స్టాగ్రామ్ 'వ్యసనం'

- టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై ఇన్‌స్టాగ్రామ్ ప్రభావంపై చారిత్రాత్మక విచారణ
- లాస్ ఏంజిలస్ సుపీరియర్ కోర్టులో మెటా కంపెనీకి ఎదురుదెబ్బ
- "నిస్సహాయ స్థితిలో ఉన్నాం" అంటూ టీనేజర్ల ఆవేదన వెల్లడి
- యాప్ వ్యసనంగా మారుతుందని ముందే తెలుసని పిటిషనర్ల ఆరోపణ

03

## భూ భారతి కాదు.. భూ దోపిడీ

- భూ భారతి పోర్టల్ అక్రమార్కులకు అడ్డాగా మారిందన్న హరీశ్‌రావు
- రిజిస్ట్రేషన్ల సొమ్ములో 90 శాతం దళారుల జేబుల్లోకి వెళ్తోందని ఆరోపణ
- 37 మండలాల్లో భారీ కుంభకోణం జరిగినా ప్రభుత్వానికి సోయి లేదని విమర్శ
- నిధుల మళ్లింపుపై తక్షణమే 'సిట్'తో విచారణ జరిపించాలని డిమాండ్
- నిషేధిత భూముల జాబితా పేరుతో వసూళ్ల పర్వం సాగుతోందని ధ్వజం
- ధరణిపై బురదజల్లి తెచ్చిన పోర్టల్ దళారులకు 'హారతి' పడుతోందని ఎద్దేవా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'భూ భారతి' పోర్టల్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది భూముల రక్షణ కోసం తెచ్చిన పోర్టల్ కాదు.. సాక్షాత్తు 'భూ దోపిడీ'కి వేదికగా మారిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. జనగామలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవస్థను ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో వివరించారు. ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ నాడు గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నేతలు, నేడు తమ హయాంలో జరుగుతున్న ఈ భారీ కుంభకోణంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం, ఇప్పుడు అదే పోర్టల్ ద్వారా ఖజానాకు కన్నం వేస్తోందని హరీశ్‌రావు మండిపడ్డారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం సామాన్య ప్రజలు కష్టపడి సంపాదించిన పూర్తి మొత్తాన్ని చెల్లిస్తుంటే, పోర్టల్‌లోని 'ఎడిటింగ్ ఆప్షన్'ను అడ్డం పెట్టుకుని అక్రమార్కులు

మిగతా 3లో..

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ

**మొదటిపేజీ తరువాయి**

ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టబోమని ఎక్స్ వేదికగా ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్థ నారి' విజన్‌లో భాగంగా ఈ టీకా అమలును ఒక నిర్ణయాత్మక చర్యగా అధికార వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఏటా 1.15 కోట్ల మంది బాలికలకు టీకాలు వేయడం ద్వారా ప్రజారోగ్య ప్రయాణంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించనుంది. ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో పరిమితం కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించనున్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణలో ఇదొక విప్లవాత్మక మార్పుగా చరిత్రలో నిలిచిపోనుంది. క్యాన్సర్ నివారణా చర్యల్లో భాగంగా మొదటి మూడు నెలలు ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అర్హులైన ప్రతి బాలికకు టీకా అందేలా ప్రతిరోజూ ప్రత్యేక సెషన్లను నిర్వహించనున్నారు. అనంతరం, ఈ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను దేశవ్యాప్త సాధారణ రోగనిరోధక షెడ్యూల్‌లో శాశ్వత భాగంగా చేర్చనున్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం 14 ఏళ్లు నిండే బాలికలకు నిరంతరాయంగా ఈ టీకా సదుపాయం అందుబాటులో ఉంటుంది. సాధారణంగా బహిరంగ మార్కెట్‌లో ఈ వ్యాక్సిన్ ధర వేల రూపాయల్లో ఉంటుంది, ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతోంది. ఈ విషయాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం, ఖరీదైన ఈ టీకాను సామాన్యులకు చేరవేయాలనే ఉద్దేశంతో ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఆయుష్మాన్



ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ టీకా లభిస్తుంది. అయితే, టీకా వేసే ముందు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

టీకా పంపిణీ ప్రక్రియలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. శిక్షణ పొందిన వైద్య అధికారులు మరియు నైపుణ్యం కలిగిన ఆరోగ్య సంరక్షణ బృందాల పర్యవేక్షణలోనే ప్రతి సెషన్ జరుగుతుంది. టీకా తీసుకున్న తర్వాత ఏవైనా చిన్నపాటి ఇబ్బందులు ఎదురైతే తక్షణమే చికిత్స అందించడానికి 24 గంటల పాటు వైద్య సదుపాయాలను అనుసంధానం చేశారు. నాణ్యమైన వైద్యం మరియు నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

గణాంకాల ప్రకారం, భారత్‌లో మహిళల్లో సంభవిస్తున్న క్యాన్సర్ మరణాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రెండో అతిపెద్ద కారణం. ప్రతి సంవత్సరం మన దేశంలో సుమారు 1.2 లక్షల కొత్త కేసులు నమోదవుతుండగా, దాదాపు 80,000 మంది మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. గ్లోబోకాన్ డేటా వెల్లడిస్తున్న ఈ భయంకరమైన వాస్తవాలు మహిళా ఆరోగ్యంపై తక్షణ దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. సరైన అవగాహన లేకపోవడం, పరీక్షలు చేయించుకోవడంలో జాప్యం కారణంగానే మరణాల రేటు ఎక్కువగా ఉందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భాశయ క్యాన్సర్‌ను టీకా ద్వారా, ముందస్తు స్క్రీనింగ్ ద్వారా 100 శాతం నివారించే అవకాశం ఉంది. చిన్న వయస్సులోనే ఈ టీకా తీసుకోవడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వైరస్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోగలదు. ముందస్తు పరీక్షలే ప్రాణదాతలని, ప్రజలు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్ ద్వారా క్యాన్సర్ రహిత సమాజం వైపు అడుగులు వేయాలని కేంద్రం పిలుపునిచ్చింది. ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం మహిళా సాధికారతకు ఒక గొప్ప వేదికగా నిలుస్తోంది. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని 'స్వస్థ నారి' విజన్ స్పష్టం చేస్తోంది. కేవలం మందులు పంపిణీ చేయడమే కాకుండా, క్యాన్సర్ పట్ల మహిళల్లో ఉన్న భయాలను పోగొట్టి, వారిలో చైతన్యాన్ని తీసుకురావడమే ఈ పథకం అసలు ఉద్దేశం. రాజస్థాన్ మట్టిలో మొదలైన ఈ చైతన్యం దేశమంతటా విస్తరించాలని కేంద్రం భావిస్తోంది. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అనేది ఒక టీకా కార్యక్రమం మాత్రమే కాదు, అది లక్షలాది మంది ఆడబిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా. ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం వల్ల రాబోయే తరాల్లో క్యాన్సర్ మహమ్మారి ఛాయలు లేకుండా చేయవచ్చు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు ఈ టీకా వేయించి, ప్రభుత్వ ఆశయ సాధనలో భాగస్వాములు కావాలి. ఆరోగ్యవంతమైన మహిళలతోనే సమున్నత భారతం సాధ్యమవుతుందన్న ప్రధాని మాటలు ప్రతి ఇంటికి స్ఫూర్తిని నింపాలి.

## పొంగిపొర్లుతున్న మురుగునీరు

- మేడిబావి బస్తీ లో రోడ్డుపై మురుగునీరు .. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, పాదాచారులు, వాహనదారులు. -పట్టించుకోని అధికారులు



**సికింద్రాబాద్, విశాలభారతి :** మేడిబావి బస్తీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. గత పది రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతు మురుగు నీరు రోడ్డుపై పారు తుంది. అయినా అధికారులు , నాయకులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే ప్రభుత్వ కళాశాల ఉంది.విద్యార్థులు దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాము రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. గత కొన్ని రోజులుగా రోజులుగా సమస్య ఇలాగే ఉంది. అయినా జలమండలి అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్న కొట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ పక్క బస్తి నుండే వెళ్లారు కానీ ఇక్కడికి మాత్రం రాలేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన ఉందన్న సమాచారం ఉన్న అధికారులు పట్టించుకోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీస్ స్టేషన్లో కంటి పరీక్షలు



**పాల్వంచ, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు మరియు ప్రజా రవాణా చేసే డ్రైవర్లకు అర్రైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో సుమారు 200కు పైగా డ్రైవర్లుకు పాల్వంచ ఎల్.వి.ప్రసాద్ హాస్పిటల్ సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగు సూచనలు చేసి అవసరమైనటువంటి మందులు కూడా అందించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో పాల్వంచ డి.ఎస్.పి. ఆర్.సతీష్ కుమార్, పాల్వంచ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే .సతీష్, పాల్వంచ టౌన్ ఎస్సైలు అయిన జీవన్ రాజు, కళ్యాణి మరియు పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ , బూర్గంపాడు ఎస్సై మెడ ప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ పేలుడు.. 21 మంది మృతి!

**మొదటిపేజీ తరువాయి**

సంభవించడంతో కార్మికులకు తప్పించుకునే అవకాశం కూడా లేకపోయింది. సుమారు గంటకు పైగా పేలుళ్లు కొనసాగడంతో సహాయక చర్యలు చేపట్టడం కూడా స్థానికులకు కష్టతరంగా మారింది. పేలుడు ధాటికి బాణసంచా కేంద్రం ఆవరణలోని పరిసరాలు బీభత్సంగా మారాయి. పేలుడు సంభవించిన సమయంలో భూకంపం వచ్చినంత శబ్దం వచ్చిందని, ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగ అలుముకుందని ప్రత్యక్ష సాక్షులు వాపోతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలకు అక్కడ కేవలం మాంసపు ముద్దలు, పూర్తిగా కాలిపోయిన అస్థిపంజరాలు మాత్రమే కనిపించాయి. ప్రాథమికంగా 21 మంది మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. వీరిలో అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, ధనరాజు, సత్యవేణి సహా 11 మందిని పోలీసులు గుర్తించగా, మిగిలిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు అవసరమయ్యేలా పరిస్థితి ఉంది. ప్రమాద సమయంలో అక్కడ ఉన్న 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పొలాల మధ్య ఈ కేంద్రం ఉండటం వల్ల అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్సులు లోపలికి వెళ్లేందుకు దారి లేక సహాయక చర్యలు తీవ్రంగా జాప్యం అయ్యాయి. స్థానికులే సాహసించి బాధితులను బైకులపై, ఆటోల్లో సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం కాకినాడ మరియు సామర్లకోట ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో తొమ్మిది మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాధితుల ఆర్తనాదాలు, బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణాలు మిన్నంటాయి. ఈ ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం విజయనగరం పర్యటనలో ఉన్న ఆయన అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత ఇప్పటికే ఘటనా స్థలానికి బయలుదేరారు. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడుతుందని సీఎం భరోసా ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,



మంత్రి కందుల దుర్గేష్ ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. బాణసంచా పరిశ్రమలో ఇలాంటి భారీ విస్ఫోటనం జరగడం అత్యంత దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీలు స్వయంగా ఘటనా స్థలంలో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో వెనుకాడబోమని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం లైసెన్స్ నిబంధనల ఉల్లంఘనపై అధికారులు ఆరా తీస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ మృతులకు నివాళులర్పించారు. "కూలీల మరణం మాటలకు అందని విషాదం" అని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దింపిందని, బాధితుల ప్రాణాలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నామని ఆయన వివరించారు. అనుమతులు, భద్రతా ప్రమాణాల విషయంలో యజమాని తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ పరిశ్రమకు ఈ ఏడాది మార్చి 31 వరకు లైసెన్స్ ఉన్నప్పటికీ, పరిమితికి మించి మందుగుండు నిల్వ చేయడం, తయారీ చేపట్టడమే ఈ విస్ఫోటనానికి కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం బాణసంచా తయారీ కేంద్రం యజమాని పరారీలో ఉన్నారని, అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఆర్డీవో తెలిపారు. భద్రతా లోపాలు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని ఎంపీ ఉదయ్ స్పష్టం చేశారు. పరిశ్రమల్లో కనీస రక్షణ కవచాలు లేకపోవడం, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో లేకపోవడమే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడానికి కారణమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు బయటకు వచ్చే మార్గాలు కూడా సక్రమంగా లేకపోవడంతో కార్మికులు లోపలే చిక్కుకుపోయారు. కేవలం లాభాపేక్షతోనే యజమానులు కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వస్తున్నాయి. మృతులలో పేద కుటుంబాలకు చెందిన మహిళలే ఎక్కువగా ఉండటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ దుర్ఘటన బాణసంచా పరిశ్రమల నిర్వహణపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. లైసెన్సులు ఉన్నా, క్షేత్రస్థాయిలో భద్రతా నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనేది ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రభుత్వం ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు పొంచి ఉన్న ఇతర తయారీ కేంద్రాలపై తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని, ఇలాంటి విషాదాలు ఏ ఊరిలోనూ పునరావృతం కాకూడదని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు.

# ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ భేరి మోగింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడులు ప్రపంచ దేశాలను తీవ్ర విస్మయానికి గురిచేశాయి. ఈ పరిణామం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగిలిపోకుండా, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే భారీ ప్రాంతీయ యుద్ధంగా మారుతుందేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. దాడుల తీవ్రతను గమనించిన ఐరోపా దేశాలు తక్షణమే అప్రమత్తమై, పరిస్థితులను సమీక్షించడం ప్రారంభించాయి. అణు కార్యక్రమాల పేరుతో జరుగుతున్న ఈ దాడులు విచక్షణారహితంగా ఉండకూడదని, సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని ప్రపంచ నేతలు నొక్కి చెబుతున్నారు. ఈ దాడుల నేపథ్యంలో ఐరోపాలో ఒక రకమైన అత్యవసర పరిస్థితి నెలకొంది. జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి అగ్రదేశాలు తమ అంతర్గత భద్రతా యంత్రాంగాలతో అత్యవసర సమావేశాలను నిర్వహించాయి. పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన తమ పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అవసరమైన రక్షణ చర్యలను వేగవంతం చేశాయి. ఇరాన్ అణు విధానాలను, అక్కడి పాలనను తాము వ్యతిరేకిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ చట్టాలను తోసిరాజని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని ఐరోపా దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇది అంతర్జాతీయ దౌత్య సంబంధాలను దెబ్బతీస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. అమెరికా తన మిత్ర దేశాలకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ దాడులకు పాల్పడటం ఇప్పుడు దౌత్యపరమైన వివాదానికి దారితీస్తోంది. ఫ్రాంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ చర్యను తీవ్రంగా పరిగణిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అత్యవసరంగా సమావేశం కావాలని పిలుపునిచ్చారు. అమెరికా వైఖరి వల్ల మధ్యప్రాచ్యంలో అనిశ్చితి నెలకొంటుందని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో యూఏఈ, ఖతార్, జోర్డాన్ వంటి దేశాలకు సైనికపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏకపక్ష చర్యలు ఎప్పుడూ శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వలేవని, అవి మరింత విధ్వంసానికే దారితీస్తాయని స్పెయిన్ స్పష్టం చేసింది.

ఐరోపా కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఈ పరిణామాలపై స్పందిస్తూ, పౌరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా చూడాలని అన్ని పక్షాలను కోరారు. యుద్ధం అనేది కేవలం సైనిక స్థావరాలకే



పరిమితం కాకుండా సామాన్య ప్రజలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి చర్చల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, దౌత్య మార్గాల ద్వారానే విభేదాలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. చర్చల ద్వారా ఇరాన్‌ను నియంత్రించవచ్చని తాము భావిస్తుండగా, ఈ ఆకస్మిక దాడులు తమ ప్రయత్నాలను నీరుగార్చాయని ఐరోపా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ దాడులు అణు విస్తరణ ముప్పును మరింత తీవ్రతరం చేస్తాయని నోబెల్ శాంతి బహుమతి ప్రతినిధి ఒకరు హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా దాడులకు పాల్పడటం వల్ల ఇరాన్ వంటి దేశాలు తమ రక్షణ కోసం అణు ఆయుధాల తయారీని వేగవంతం చేసే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఇది ప్రపంచ భద్రతకు పెను సవాలుగా మారుతుందని విశ్లేషిస్తున్నారు. మలేసియా, పాకిస్థాన్ వంటి ముస్లిం మెజారిటీ దేశాలు కూడా అమెరికాఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా ఖండించాయి. సార్వభౌమాధికారం కలిగిన దేశంపై ఇలాంటి దాడులు చేయడం అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించడమేనని ఆ దేశాలు వాదించాయి. మరోవైపు రష్యా ఈ దాడులను తీవ్రమైన దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. ఐక్యరాజ్యసమితిలో సభ్య దేశంగా ఉన్న ఇరాన్‌పై ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే అమెరికా విరుచుకుపడటం అన్యాయమని రష్యా ఆరోపించింది. అణు భయం చూపి ఇరాన్ పాలనను కూల్చివేసేందుకు అమెరికా కుట్రలు పన్నుతోందని రష్యా ఘాటుగా విమర్శించింది. వెంటనే దాడులను నిలిపివేసి, అమెరికా చర్చల మేజా వద్దకు రావాలని రష్యా డిమాండ్ చేసింది. ఈ యుద్ధ మేఘాలు తూర్పు, పశ్చిమ దేశాల మధ్య ఉన్న విభేదాలను మరింత పెంచేలా కనిపిస్తున్నాయి.

భారత్‌లో ఉన్న ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి ఈ పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేశారు. తాము దౌత్యపరంగా చర్చలు జరుపుతున్న సమయంలోనే ఈ దాడులు జరగడం దారుణమని ఆయన అన్నారు. ఇరాన్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని, కానీ తమ సార్వభౌమత్వానికి భంగం కలిగితే చూస్తూ ఊరుకోమని ఆయన సంకేతాలిచ్చారు. చర్చల ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్న తరుణంలో ఇలాంటి హింసాత్మక చర్యలు ఎదురవ్వడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిస్పందన ఎలా ఉండబోతుందన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. చమురు ధరల పెరుగుదల, సరఫరా గొలుసులో అంతరాయాలు కలగడం వంటి భయాలు మార్కెట్లను కలవరపెడుతున్నాయి. ఐరోపా దేశాలు తమ ఇంధన భద్రత గురించి ఆందోళన చెందుతున్నాయి. అందుకే యుద్ధం ఆగిపోవాలని, దౌత్యపరమైన పరిష్కారం లభించాలని ఆ దేశాలు పట్టుబడుతున్నాయి. అమెరికా ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల గ్లోబల్ ఆర్డర్ దెబ్బతింటుందని మెజారిటీ దేశాలు భావిస్తున్నాయి. అగ్రరాజ్యం తన మొండివైఖరిని వీడాలని అంతర్జాతీయ సమాజం కోరుతోంది. యుద్ధం ఎవరికీ మేలు చేయదని చరిత్ర నిరూపించింది. పశ్చిమాసియాలో రాజుకున్న ఈ నిప్పు రవ్వ ప్రపంచమంతా వ్యాపించకముందే ఆపాల్సిన బాధ్యత అగ్రరాజ్యాలపై ఉంది. కేవలం అణు పరీక్షలను అడ్డుకోవడం కోసమే ఈ దాడులని ఇజ్రాయెల్ వాదిస్తున్నప్పటికీ, అందులో ప్రాణనష్టం ఎక్కువగా ఉండటం అందరినీ కలచివేస్తోంది. రక్షణ కవచాలను దాటుకుంటూ వచ్చిన క్షిపణులు ఇరాన్ గడ్డను తాకడం వల్ల అక్కడి ప్రజలు భయాందోళనలకు లోనవుతున్నారు. ఇది కేవలం భౌతిక దాడులకే పరిమితం కాకుండా, సైబర్ యుద్ధానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు ప్రపంచ దేశాలను రెండుగా చీల్చాయి. అమెరికా వైఖరిని కొన్ని దేశాలు సమర్థిస్తుండగా, మెజారిటీ దేశాలు శాంతిని కోరుకుంటున్నాయి. యుద్ధం ద్వారా సాధించే విజయాలు తాత్కాలికమేనని, శాశ్వత శాంతి కేవలం చర్చల ద్వారానే వస్తుందని ఐరోపా దేశాల ప్రయత్నాలు తెలియజేస్తున్నాయి.

# భానుడి భగభగ.. కరెంటు ధగధగ

- మార్చి రాకముందే ఎండల తీవ్రత.. భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో శనివారం 6,057 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- ఫిబ్రవరిలోనే గత ఏడాది మార్చి రికార్డులను అధిగమించిన వినియోగం
- వేసవి సవాళ్లను ఎదుర్కొనేందుకు 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి అదనంగా 366 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు
- నిరంతర సరఫరాకు ఎన్పీడీసీఎల్ సర్వం సిద్ధం: సీఎండీ వరుణ్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వేసవి కాలం ఇంకా అధికారికంగా మొదలుకాకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చి నెల గడప తొక్కకముందే ఎండలు ముదురుతుండటంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. దీని ప్రభావం నేరుగా విద్యుత్ వినియోగంపై పడుతోంది. ఎండల తీవ్రతకు తోడు సాగు అవసరాలు పెరగడంతో తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ఫిబ్రవరి మాసంలోనే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరడం అటు అధికారులను, ఇటు సామాన్యులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవి ఆరంభానికి ముందే విద్యుత్ యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతోంది. గత శనివారం ఒక్కరోజే ఎన్పీడీసీఎల్ పరిధిలో ఏకంగా 6,057 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదవడం విశేషం. ఫిబ్రవరి నెల చరిత్రలోనే ఇంతటి భారీ స్థాయిలో వినియోగం నమోదు కావడం ఇదే తొలిసారి అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. సాధారణంగా మార్చి రెండో వారం నుంచి పెరిగే విద్యుత్ డిమాండ్, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే గరిష్ట స్థాయికి చేరడం వాతావరణ మార్పులకు అద్దం పడుతోంది. ఎండల వేడిని తట్టుకునేందుకు గృహ అవసరాలకు ఏసీలు, కూలర్ల వాడకం పెరగడంతో పాటు, యాసంగి పంటలకు నీరందించేందుకు రైతులు మోటార్లను వినియోగిస్తుండటమే ఈ డిమాండ్‌కు ప్రధాన కారణమని తెలుస్తోంది.

గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే ప్రస్తుత వినియోగం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. 2024 మార్చి 11న నమోదైన 5,816 మెగావాట్ల గరిష్ట డిమాండ్ అప్పట్లో ఒక రికార్డు. అయితే, ఈ ఏడాది ఆ రికార్డును ఫిబ్రవరిలోనే అధిగమించడం గమనార్హం. అంటే గత ఏడాది వేసవి గరిష్ట స్థాయి కంటే ఈసారి ఫిబ్రవరిలోనే దాదాపు 241 మెగావాట్ల అదనపు విద్యుత్ వినియోగం పెరిగింది. రాబోయే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే, విద్యుత్ డిమాండ్ ఊహించని స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది.

వేసవి తీవ్రతను ముందే పసిగట్టిన ఎన్పీడీసీఎల్ యాజమాన్యం, విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఎక్కడా అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. వినియోగం పెరిగినప్పుడు లైన్లు ట్రిప్ అవ్వకుండా, ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంస్థ పరిధిలో కొత్తగా 35 సబ్‌స్టేషన్లను (33/11 కేవీ) యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఈ సబ్‌స్టేషన్లు పెరిగిన లోడ్‌ను తట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై సీఎండీ వరుణ్ రెడ్డి పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. కేవలం సబ్‌స్టేషన్ల ఏర్పాటుతోనే ఆగకుండా, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి 366 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను వివిధ ప్రాంతాల్లో అమర్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉండేందుకు ముందస్తుగా సుమారు 7,600 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని (కెపాసిటీ) పెంచారు. ఓవర్‌లోడ్ సమస్య ఎక్కువగా ఉన్న 33 కేవీ సామర్థ్యం గల 8 ఫీడర్లను విభజించి, లోడ్ సమతుల్యతను సాధించారు. దీనివల్ల నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి వీలుంటుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఈ చర్యల వల్ల వేసవిలో రైతాంగానికి ఇబ్బందులు కలగకుండా చూడవచ్చని సంస్థ ఆశిస్తోంది.

విద్యుత్ పంపిణీలో లైన్ల సామర్థ్యం కూడా అంతే ముఖ్యం. అందుకే ఎన్పీడీసీఎల్ పరిధిలో సుమారు 1,200 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లను నిర్మించారు. ఏదైనా ఒక లైన్‌లో సమస్య తలెత్తినా, వినియోగదారులకు అంతరాయం కలగకుండా మరో లైన్ ద్వారా సరఫరా పునరుద్ధరించేలా ఈ ఏర్పాటు చేశారు. అలాగే వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్యను అధిగమించడానికి 392 కెపాసిటర్ బ్యాంకులను వ్యవస్థలో అనుసంధానించారు. ఇవి విద్యుత్ ప్రవాహాన్ని క్రమబద్ధీకరించి, పరికరాలు పాడవకుండా కాపాడతాయి. ముఖ్యంగా పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశం. ఉత్తర తెలంగాణలోని జిల్లాల్లో వ్యవసాయం ప్రధాన జీవనాధారం కావడంతో, పగటిపూట విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. గతంలో వేసవిలో విద్యుత్ కోతలు విధించే పరిస్థితి ఉండేది, కానీ ఇప్పుడు అదనపు విద్యుత్ కొనుగోలుతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వల్ల అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని రైతాంగానికి సాగు నీటి కోసం నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది. ఎక్కడైనా సమస్య వస్తే తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగడం వల్ల ఖజానాపై భారం పడినప్పటికీ, వినియోగదారుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎండీ వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా నాణ్యత తగ్గకుండా చూస్తున్నామని, ఫిబ్రవరి రికార్డు స్థాయి డిమాండ్‌ను విజయవంతంగా తట్టుకున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలలు మరింత సవాలుతో కూడుకున్నవని, అయినప్పటికీ విద్యుత్ సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.

# విద్యార్థులు బాగా చదువుకొని పైకి రావాలి

**మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీరామ్మూర్తి**



**పాల్వంచ రూరల్ : విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులు అందరూ కూడా అంకుటిత దీక్షతో చదువుకుని పై స్థాయికి ఎదగాలని చదువుకున్న పాఠశాలలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీరామ్మూర్తి కోరారు. పాల్వంచ మండలంలోని జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన కాంప్లెక్స్ స్థాయి బాలబేళా ..2026 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతున్నదని దీన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలోని 18 పాఠశాలలకు నుంచి 1వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు తరగతి వారీగా సామర్థ్యాలపై పరీక్షలు నిర్వహించారు. అత్యంత నైపుణ్యత కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండు, మూడు బహుమతులను అందించారు. బాలమేళా సందర్భంగా ఆయా పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆటపాటలతో అలరింపజేశారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ బి శ్రీనివాసరావు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, సిఆర్పి శ్రీనివాస్ రావు, పిఆర్పిలు రమేష్, గీత తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ చిల్డ్రన్ స్కూల్‌లో ఘనంగా 'జాతీయ సైన్స్ డే వేడుకలు

**పాల్వంచ విశాలభారతి:** స్థానిక స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో శనివారం స్కూల్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా విద్యార్థులు తమ చిరు మేధస్సుతో రూపొందించిన పలు ప్రయోగాలు భవిష్యత్ సాంకేతికతపై వారికున్న పట్టును నిరూపించాయి. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఆదా మార్గాలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ప్రయోగం ఏదో ఒక సామాజిక సమస్యకు పరిష్కారం చూపేలా ఉండటం విశేషం. పాఠశాల సైన్స్ విభాగం సిబ్బంది జి. స్వరూప, ఎస్. ప్రశాంతి, పి. మాధవి మాట్లాడుతూ.. "పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని,నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, వారి ఆలోచనా దృక్పథం దేశ భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగిస్తోందని" కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ జి. భాస్కర్ రావు, ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# కోకాపేట భూములు శారదా పీఠానికే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ శివారులోని కోకాపేట భూములు మరోసారి వార్తల్లో నిలిచాయి. ఇక్కడి విశాఖ శారదా పీఠానికి కేటాయించిన భూములకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. పీఠం పరిధిలోని భూములను జలమండలికి కేటాయిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ భూముల్లో ప్రస్తుతం జలమండలి చేపట్టిన నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల వినియోగంపై స్పష్టత ఉండాలని, ఎవరికి కేటాయించిన భూములను వారికే ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణం శారదా పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యను వివరించడమే. పీఠానికి కేటాయించిన స్థలంలో జలమండలి అధికారులు ప్రవేశించి నిర్మాణ పనులు చేపడుతున్నారని, దీనివల్ల తమ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీఠం భూములను జలమండలికి ఎలా కేటాయించారో వివరణ కోరారు. ఒక సంస్థకు కేటాయించిన భూమిని మరో ప్రభుత్వ విభాగానికి బదలాయించే ముందు పాటించాల్సిన నియమ నిబంధనలపై ఆయన ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో అధికారుల తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన సమయంలో, ఆ స్థలంలో ఉన్న నిర్మాణాల స్థితిగతులు మరియు పాత కేటాయింపుల వివరాలను ఎందుకు పొందుపరచలేదని ఆయన ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను మరుగున పెట్టి ఫైళ్లను ముందుకు పంపడం పట్ల అధికారులను మందలించారు. అసంపూర్ణ సమాచారంతో నిర్ణయాలు తీసుకుంటే అది న్యాయపరమైన చిక్కులకు దారితీస్తుందని, భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయన



హెచ్చరించారు. రాష్ట్ర రాజధానిలో భూములకున్న డిమాండ్ దృష్ట్యా, ప్రతి అంగుళం భూమిని జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ మరియు పురపాలక శాఖలపై ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. శారదా పీఠం అనేది ఆధ్యాత్మిక కేంద్రమని, అటువంటి ప్రదేశాలకు కేటాయించిన భూముల విషయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జలమండలి అవసరాల కోసం ప్రత్యామ్నాయ భూములను అన్వేషించాలని, అంతేకానీ ఇప్పటికే ఒక ప్రయోజనం కోసం కేటాయించిన భూములను లాక్కోవడం సరైన పద్ధతి కాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జలమండలి అధికారులు కోకాపేటలోని ఆ స్థలంలో పనులను నిలిపివేశారు. అక్కడ నిర్మించ తలపెట్టిన జలాశయాలు లేదా ఇతర మౌలిక సదుపాయాల కోసం మరో చోట స్థల సేకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. శారదా పీఠానికే ఆ భూములు తిరిగి దక్కేలా అధికారికంగా ఉత్తర్వులు సవరించాలని సీఎం సూచించారు. ఈ నిర్ణయంతో శారదా పీఠం నిర్వాహకులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ముఖ్యమంత్రి త్వరితగతిన స్పందించి తమ విన్నపాన్ని మన్నించడం పట్ల పీఠం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అయితే, భూకేటాయింపుల విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షిస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పీఠం భూముల వ్యవహారంలో పారదర్శకత పాటించాలని రేవంత్ రెడ్డి పదే పదే అధికారులకు చెబుతున్నారు. భూములను అప్పగించేటప్పుడు కేవలం కాగితాల మీద సంతకాలు కాకుండా, భౌతికంగా అక్కడ ఏముంది అన్నది పరిశీలించాలని ఆయన సూచించారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే నివేదికలు ఇవ్వాలని కఠినంగా చెప్పారు. దీనివల్ల అనవసరమైన వివాదాలకు తెరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న విలువైన భూముల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో పలు ఆధ్యాత్మిక, సామాజిక సంస్థలకు కేటాయించిన భూముల్లో నిబంధనలు ఉల్లంఘించారా లేదా అన్నది ఒకెత్తు అయితే, సక్రమంగా ఉన్న కేటాయింపులకు భంగం కలగకుండా చూడటం మరో ఎత్తు. శారదా పీఠం విషయంలో సీఎం తీసుకున్న నిర్ణయం న్యాయబద్ధంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇతర విభాగాల భూములను ఆక్రమించుకోవడం సరికాదనే సందేశాన్ని ఈ నిర్ణయం ద్వారా సీఎం రేవంత్ పంపినట్లయింది.

ఈ పరిణామంతో జలమండలి తన ప్రాజెక్టుల కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోకాపేట వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ భూములు దొరకడం కష్టమైనప్పటికీ, ప్రభుత్వ భూములు ఎక్కడ అందుబాటులో ఉన్నాయో వెతకాలని అధికారులకు ఆదేశాలు అందాయి. నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైన చోట పరిస్థితి ఏంటన్నది పరిశీలిస్తున్నారు. పీఠం ఆవరణలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని, జలమండలి తన యంత్ర సామాగ్రిని అక్కడి నుండి తరలించాలని అధికారులు నిర్ణయించారు.

ప్రభుత్వ నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలకు లేదా సంస్థలకు ఇబ్బంది కలగకూడదని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే ఫిర్యాదు అందిన వెంటనే పూర్తి వివరాలు సేకరించి, తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. అధికారుల పై ఆయన వ్యక్తం చేసిన అసహనం కూడా పాలనలో జవాబుదారీతనాన్ని పెంచేందుకేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పీఠం భూముల వివాదం సద్దుమణగడంతో, ఇతర భూకేటాయింపుల విషయంలో కూడా అధికారులు ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కోకాపేట శారదా పీఠం భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పాలనాపరమైన సమర్థతకు నిదర్శనంగా నిలిచింది. ఒక ఆధ్యాత్మిక సంస్థకు జరిగిన అసౌకర్యాన్ని గుర్తించి, జలమండలికి చేసిన కేటాయింపులను రద్దు చేయడం ద్వారా న్యాయాన్ని కాపాడారు. అధికారుల అలసత్వాన్ని ఎండగట్టడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిర్ణయంతో కోకాపేట భూముల వివాదానికి తెరపడటమే కాకుండా, శారదా పీఠం భూములకు పూర్తి స్థాయి రక్షణ లభించింది.

# భూ భారతి కాదు.. భూ దోపిడీ

**మొదటిపేజీ తరువాయి**

చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి కేవలం పది శాతం మాత్రమే చెల్లించి, మిగతా తొంభై శాతం నిధులను దళారులు, అధికారులు పంచుకుంటున్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ఈ వ్యవహారం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా సాగుతోందని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వ నిఘా విభాగాలకు కనీస సమాచారం లేకపోవడం ఆశ్చర్యకరమని హరీశ్‌రావు అన్నారు. పత్రికల్లో వార్తలు వస్తే తప్ప ముఖ్యమంత్రికి గానీ, రెవెన్యూ మంత్రికి గానీ ఈ విషయంపై స్పృహ లేకపోవడం దారుణమన్నారు. కేవలం మండల స్థాయి ఆపరేటర్లను అరెస్టు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని, ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పెద్ద అధికారులు, అధికార పార్టీ నేతల పేర్లు బయటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టడానికి ప్రతి చిన్న విషయానికీ కమిషన్లు వేసే రేవంత్ రెడ్డి, మరి ప్రభుత్వ ఖజానా లూటీ అవుతుంటే 'సిట్' విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది రాష్ట్ర ప్రజల సొత్తు అని, దీనిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను అక్రమార్కుల నుంచి రాబట్టాలని ఆయన స్పష్టం చేశారు. కేవలం కింది స్థాయి సిబ్బంది పై చర్యలతో సరిపెడితే అసలు దొంగలు తప్పించుకునే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

నిషేధిత భూముల (22A) జాబితా ఇప్పుడు వసూళ్ల దందాలకు అడ్డాగా మారిందని హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని కింది స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ఒకసారి బాధితుల నుంచి వసూళ్లు పూర్తి కాగానే,




ఆ భూములను జాబితా నుంచి తొలగించడం ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని ధ్వజమెత్తారు. రైతులను ఇబ్బంది పెడుతూ సాగిస్తున్న ఈ మాఫియా వెనుక ఉన్న పెద్దల జాతకాలను బయటపెడతామని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖలో పారదర్శకత లోపించిందని, దళారీ వ్యవస్థ మళ్లీ వేళ్లూనుకుందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా గత ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేస్తే, ప్రస్తుత ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ పేరుతో అవినీతికి ద్వారాలు తెరిచిందని విమర్శించారు. రైతులు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, డబ్బులు ఇస్తే తప్ప పనులు జరగని పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే వాటిని లూటీ చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్లుగా ఇది సామాన్యుల ప్రభుత్వం కాదని, దళారుల రాజ్యమని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేవలం రాజకీయ విమర్శలపై ఉన్న శ్రద్ధ, పరిపాలనపై లేదని విమర్శించారు. సామాన్య రైతు తన భూమిని అమ్ముకోవాలన్నా లేదా కొనుక్కోవాలన్నా భయపడే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. భూ భారతి పోర్టల్ ద్వారా జరుగుతున్న ఆర్థిక నేరాల బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలని, మళ్లింపునకు గురైన నిధులను తక్షణమే ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యేలా చూడాలని ఆయన కోరారు.

తెలంగాణలో భూముల విలువ పెరిగిన నేపథ్యంలో ఇలాంటి పోర్టల్ అక్రమాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని కూడా దెబ్బతీస్తాయని హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పోర్టల్‌లోనే మార్పులు చేసి నిధులు మళ్లించడం అంటే సామాన్యమైన విషయం కాదని, దీని వెనుక ఐటీ నిపుణుల హస్తం కూడా ఉండే అవకాశం ఉందన్నారు. సమగ్ర విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటకు వస్తాయని, లేదంటే ప్రజలు ప్రభుత్వాన్ని క్షమించరని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనగామ ప్రాంతంలో జరుగుతున్న భూ అక్రమాలను ప్రస్తావిస్తూ, స్థానిక కాంగ్రెస్ నేతలు భూములను కబ్జా చేయడమే కాకుండా పోర్టల్ ద్వారా అధికారికంగా లూటీ చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఖజానా సొమ్మును కాపాడతామని భరోసా ఇచ్చారు. ఈ స్కామ్‌పై తాము ఊరుకోబోమని, శాసనసభ లోపల, బయట కూడా ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రెవెన్యూ వ్యవస్థలో జరుగుతున్న తప్పులను సరిదిద్దుకోవాలని హరీశ్‌రావు హితవు పలికారు. ప్రజల భూములపై హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. భూ భారతి పేరుతో చేస్తున్న ఈ మాయాజాలాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి, ఎంత మొత్తం మళ్లింపు జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తూ హరీశ్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.

# బాత్ రూమ్‌లో ప్రసవించిన ఇంటర్ విద్యార్థిని

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో శుక్రవారం నాడు అత్యంత విషాదకరమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన చోటుచేసుకుంది. ఒక పక్క రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్న వేళ, పరీక్షా కేంద్రంలోనే ఒక మైనర్ బాలిక ప్రసవించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. చదువుకోవాల్సిన వయసులో, భవిష్యత్తును నిర్ణయించే పరీక్ష రాస్తూ ఆ విద్యార్థిని పడ్డ ప్రసవ వేదన విద్యాశాఖ అధికారులను, తోటి విద్యార్థులను విస్మయానికి గురిచేసింది. ఈ ఘటన విద్యా వ్యవస్థలోని లోపాలను, సమాజంలోని సామాజిక పరిస్థితులను మరోసారి చర్చకు వచ్చేలా చేసింది.

వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో శుక్రవారం ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల పరీక్ష ప్రారంభమైంది. నిర్ణీత సమయానికి విద్యార్థులందరూ హాల్లోకి చేరుకున్నారు. పరీక్ష ప్రారంభమైన సుమారు 30 నిమిషాల తర్వాత, సదరు 16 ఏళ్ల బాలిక తనకు కడుపునొప్పిగా ఉందని, బాత్‌రూమ్‌కు వెళ్లాలని ఇన్విజిలేటర్‌ను కోరింది. విద్యార్థిని ఇబ్బందిని గమనించిన సిబ్బంది ఆమెను వెళ్లడానికి అనుమతించారు. అయితే ఆమె వెళ్లి చాలా సమయం గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్ అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. ఆ సమయంలో బాలిక బాత్‌రూమ్ నుంచి అత్యంత నీరసంగా, నడవలేని స్థితిలో బయటకు రావడం గమనించిన సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఏమైందని ఆరా తీయగా, తాను గర్భవతినని, తీవ్రమైన నొప్పులు రావడంతో అక్కడే ప్రసవించానని ఆ బాలిక కన్నీటి పర్యంతమై వివరించింది. వెంటనే సిబ్బంది లోపలికి వెళ్లి చూడగా, బాత్‌రూమ్ బేసిన్‌లో ఒక మృతశిశువు పడి ఉండటం చూసి హతాశులయ్యారు. పరీక్షా కేంద్రంలో ఇలాంటి ఘటన జరగడం ఇన్విజిలేటర్లను మరియు అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని ఒక్కసారిగా నిర్ఘాంతపోయేలా చేసింది.




వెంటనే కళాశాల యాజమాన్యం పోలీసులకు, ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పాల్వంచ పోలీసులు పరిస్థితిని సమీక్షించి, తీవ్ర రక్తస్రావంతో నీరసించి పోయిన బాలికను హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతశిశువును పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి పంపించారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న పరీక్షా కేంద్రం ఒక్కసారిగా పోలీసుల రాకతో, హడావుడితో కలకలలాడింది. ఈ విషయం తెలిసిన ఇతర గదుల్లోని విద్యార్థులు కూడా ఆందోళనకు లోనయ్యారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆ బాలిక వయసు కేవలం 16 ఏళ్లేనని తేలింది. ఇంత చిన్న వయసులో ఆ బాలిక గర్భం దాల్చడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? దీనికి కారకులు ఎవరు? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గర్భంతో ఉన్న విషయం తల్లిదండ్రులకు తెలుసా లేదా? కళాశాల యాజమాన్యం దీనిని గుర్తించలేదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. బాధితురాలు మైనర్ కావడంతో ఈ కేసును పోలీసులు అత్యంత సున్నితంగా, సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఇంకా ఎవరూ అధికారికంగా ఫిర్యాదు చేయలేదని పోలీసులు వెల్లడించారు. బాలిక తల్లిదండ్రులు లేదా బంధువులు ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు ఇస్తే దాని ఆధారంగా కేసు నమోదు చేస్తామని, ఒకవేళ ఎవరూ ముందుకు రాకపోతే చట్టప్రకారం కళాశాల యాజమాన్యం లేదా విద్యాశాఖ అధికారుల ఫిర్యాదుతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మైనర్ గర్భం దాల్చడం నేరం కాబట్టి, దీని వెనుక ఏదైనా లైంగిక వేధింపులు లేదా ఇతర కుట్రలు ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది.

ఈ సంఘటన జిల్లావ్యాప్తంగా విద్యాశాఖలో పెద్ద చర్చకు దారితీసింది. పరీక్షల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తతపై కూడా కొన్ని విమర్శలు వినిపిస్తున్నాయి. గర్భవతిగా ఉన్న బాలికను పరీక్షకు అనుమతించే సమయంలో ఎవరూ ఎందుకు గమనించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థినుల ఆరోగ్యం మరియు భద్రత విషయంలో కళాశాలలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పాల్వంచ ప్రాంతంలో ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో ప్రజలు విస్మయానికి లోనయ్యారు. ముఖ్యంగా మృతశిశువు జన్మించడం, ఆ స్థితిలో కూడా బాలిక పరీక్ష రాయడానికి రావడం చూస్తుంటే ఆమె పడిన వేదన వర్ణనాతీతం. సామాజికంగా ఎదురయ్యే అవమానాలకు భయపడే ఆ బాలిక తన గర్భాన్ని రహస్యంగా ఉంచి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. ఏది ఏమైనా ఒక మైనర్ బాలిక ఇంతటి దారుణ స్థితికి చేరుకోవడం సమాజానికి ఒక హెచ్చరికగా మారింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆమె కోలుకున్న తర్వాత పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డ్ చేసే అవకాశం ఉంది. ఈ కేసులో దోషులు ఎవరైనా ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు.

# టీనేజర్లలో ఇన్‌స్టాగ్రామ్ 'వ్యసనం'

- టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై ఇన్‌స్టాగ్రామ్ ప్రభావంపై చారిత్రాత్మక విచారణ
- లాస్ ఏంజిలస్ సుపీరియర్ కోర్టులో మెటా కంపెనీకి ఎదురుదెబ్బ
- "నిస్సహాయ స్థితిలో ఉన్నాం" అంటూ టీనేజర్ల ఆవేదన వెల్లడి
- యాప్ వ్యసనంగా మారుతుందని ముందే తెలుసని పిటిషనర్ల ఆరోపణ
- ఫోమో , కుంగుబాటు, ఆత్మహత్య ఆలోచనలపై బాధితుల వాంగ్మూలం
- లీకైన అంతర్గత నివేదికలతో ఇరుకున పడ్డ మార్క్ జుకర్ బర్గ్ సంస్థ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం శ్రుతిమించుతోందన్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రముఖ సామాజిక మాధ్యమ దిగ్గజం మెటాకు చెందిన 'ఇన్‌స్టాగ్రామ్' అమెరికాలో ఒక చారిత్రాత్మక న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటోంది. లాస్ ఏంజిలస్ సుపీరియర్ కోర్టులో జరుగుతున్న ఈ సంచలన విచారణ కేవలం మెటా కంపెనీకే కాకుండా, యావత్ బిగ్ టెక్ ప్రపంచానికి ఒక హెచ్చరికగా మారింది. ఇన్‌స్టాగ్రామ్ కేవలం ఒక సమాచార మార్పిడి వేదికగా కాకుండా, టీనేజర్ల పాలిట ఒక వ్యసనంగా మారుతోందనే ఆరోపణలు ఇప్పుడు న్యాయస్థానం



మెట్లు ఎక్కాయి. పిటిషనర్లు కోర్టులో సమర్పించిన ఆధారాలు మెటా కంపెనీని తీవ్రంగా ఇరుకున పెడుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ వినియోగం వల్ల యువత మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని, వారిలో ఒక రకమైన బానిసత్వ ధోరణి పెరుగుతోందని కంపెనీకి ముందే తెలుసని వారు వాదిస్తున్నారు. ఇందుకోసం మెటా సంస్థకు చెందిన అంతర్గత పరిశోధనా నివేదికలు, రహస్య ఈమెయిళ్లు,పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లను ఆధారాలుగా చూపారు. లాభార్జనే ధ్యేయంగా కంపెనీ తన యాప్‌లోని ఫీచర్లను రూపొందించిందని, దీనివల్ల కలిగే అనర్థాలను కావాలనే విస్మరించిందని ఆరోపిస్తున్నారు. న్యాయస్థానం ముందు బయటపడిన ఈ అంతర్గత నివేదికలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. చాలామంది టీనేజ్ వినియోగదారులు తమ మనసులోని మాటలను ఈ పరిశోధనల్లో పంచుకున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. "మంచైనా, చెడైనా ఈ యాప్‌ను వాడకుండా ఉండలేకపోతున్నాం, మేము ఒక నిస్సహాయ స్థితిలో ఉన్నాం" అనే అభిప్రాయాలు యువతలో బలంగా ఉన్నట్లు సమాచారం. ఈ నివేదికలే ఇప్పుడు మెటాకు పెద్ద తలనొప్పిగా మారాయి. వినియోగదారుల బలహీనతలను సొమ్ము చేసుకునేలా యాప్ అల్గారిథమ్స్ పనిచేస్తున్నాయనే అనుమానాలకు ఇవి బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ కేసులో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం 'ఫోమో'. తమ ఆన్‌లైన్ స్నేహితులకు ఎక్కడ దూరమౌతామో, లేక వారు చేసే పోస్టులను చూడకపోతే వెనుకబడిపోతామేమోననే భయం టీనేజర్లను ఇన్‌స్టాగ్రామ్‌కు కట్టిపడేస్తోంది.

2019లో తయారైన ఒక నివేదికలో "అడిక్టివ్ నరేటివ్" అనే పదాన్ని మెటా ప్రతినిధులు ఉపయోగించినట్లు పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంటే, వినియోగదారులు యాప్‌ను వదలలేని విధంగా కంటెంట్‌ను ఎలా అందించాలనే దానిపై కంపెనీ శాస్త్రీయంగా కసరత్తు చేసిందని అర్థమవుతోంది. విచారణ సందర్భంగా ఒక 20 ఏళ్ల యువతి ఇచ్చిన వాంగ్మూలం న్యాయస్థానాన్ని కలిచివేసింది. చిన్న వయసులోనే ఇన్‌స్టాగ్రామ్ వాడటం ప్రారంభించిన ఆమె, కాలక్రమేణా తీవ్రమైన కుంగుబాటుకు గురైనట్లు తెలిపింది. తన శరీరాకృతిని ఇతరులతో పోల్చుకుంటూ ఆందోళన చెందడం, చివరికి ఆత్మహత్య ఆలోచనల వరకు వెళ్లడం వంటి భయంకరమైన అనుభవాలను ఆమె వివరించింది. "ఫోన్ పక్కన పెట్టలేను, అలాగని వాడితే ప్రశాంతత ఉండదు" అని ఆమె దీనంగా చెప్పినప్పుడు కోర్టులోని వారంతా చలించిపోయారు. ఇది కేవలం ఒక యువతి సమస్య కాదని, లక్షలాది మంది యువత ఎదుర్కొంటున్న వాస్తవమని పిటిషనర్లు వాదిస్తున్నారు. ప్రజావేగుల ద్వారా లీకైన సమాచారాన్ని 'ది హైవైర్', 'ది ఆంక్షియస్ జనరేషన్' వంటి వెబ్‌సైట్లు విశ్లేషించి ప్రచురించాయి. వీటి ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండే లైక్స్, హార్ట్స్, నోటిఫికేషన్లు మెదడులోని డోపమైన్ వ్యవస్థపై ప్రభావం చూపుతాయని, తద్వారా వినియోగదారులు దానికి బానిసలుగా మారుతారని తేలింది. ముఖ్యంగా ఎదుగుతున్న వయసులో ఉండే పిల్లల మెదడు ఈ కృత్రిమ ప్రేరణలకు త్వరగా లోనవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీనివల్ల వారిలో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, చిరాకు వంటి లక్షణాలు ప్రస్ఫుటమవుతున్నాయి.

అయితే, మెటా యాజమాన్యం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది. సోషల్ మీడియా వాడకానికి, మానసిక సమస్యలకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని చెప్పడానికి శాస్త్రీయమైన ఆధారాలు లేవని కంపెనీ వాదిస్తోంది. తాము చేసిన అంతర్గత పరిశోధనలు కేవలం వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, మరింత నాణ్యమైన సేవలు అందించడానికేనని మెటా ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది సానుకూల అనుభవాలను పొందుతున్నారని, స్నేహితులతో అనుసంధానం కావడానికి ఇది ఒక గొప్ప వేదిక అని వారు కోర్టుకు విన్నవించారు. ఈ కేసులో పిటిషనర్ల వాదన మరోలా ఉంది. కేవలం లాభాల కోసం సామాజిక బాధ్యతను గాలికొదిలేయడం నేరమని వారు అంటున్నారు. యాప్‌లోని 'అనంతమైన స్క్రోలింగ్' వంటి ఫీచర్లు వినియోగదారుడికి సమయం తెలియకుండా చేస్తాయని, ఇది కావాలని చేసిన ప్లాన్ అని వారు ఆరోపిస్తున్నారు. నివేదికల్లో పేర్కొన్నట్లుగా, యువతలో పెరిగిన ఆందోళన స్థాయిలకు ఇన్‌స్టాగ్రామ్ డిజైనే కారణమని, ఇందుకు మెటా బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు విచారణ బిగ్ టెక్ కంపెనీల నియంత్రణకు సంబంధించిన చట్టాలలో కీలక మార్పులకు దారితీసేలా కనిపిస్తోంది. కోర్టులో జరుగుతున్న ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మన చేతుల్లో ఉండే ఫోన్లు మన పిల్లల మెదళ్లను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఈ విచారణ ద్వారా స్పష్టమవుతోంది. సోషల్ మీడియా కంపెనీలు తమ వ్యాపార రహస్యాలను ఎలా దాచిపెడతాయో, బాహ్య ప్రపంచానికి ఒకటి చెబుతూ అంతర్గతంగా మరోలా ఎలా వ్యవహరిస్తాయో ఈ కేసు నిరూపిస్తోంది. ఒకవేళ కోర్టు మెటాకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే, అది సాంకేతిక రంగంలో ఒక ప్రకంపన సృష్టించడం ఖాయం. టెక్నాలజీ అనేది మన జీవితాలను సులభతరం చేయడానికి ఉండాలి కానీ, జీవితాలను బలితీసుకోకూడదు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలు టీనేజర్ల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# డయల్100 అత్యవసర పరిస్థితుల్లో ప్రజా రక్షణ కోసం




**విశాలభారతి, ఎన్టిపిసి:** పోలీసుల సత్వర స్పందనతో మహిళ ప్రాణాల రక్షణ బ్లూ కోల్ట్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. డయల్ 100కు వచ్చిన సమాచారంపై వెంటనే చర్యలు తీసుకుని ఆత్మహత్యా ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నివసిస్తున్న ఘర్ష నర్మద భర్త కిరణ్ కుటుంబ కలహాల నేపథ్యంలో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి మేడిపల్లి ఫిల్టర్ బెడ్ వైపు పరుగెత్తుతున్నట్లు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది.సమాచారం అందుకున్న వెంటనే ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ అప్రమత్తమై బ్లూ కోల్ట్ సిబ్బంది పీసీ శ్రీరామ్, హెచ్‌జీ రాజేష్‌లకు సమాచారం ఇచ్చారు. బ్లూ కోట్ సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా వ్యవహరించి ఆ మహిళను అదుపులోకి తీసుకుని ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.పోలీసుల సత్వర స్పందనతో ఒక మహిళ ప్రాణాలు రక్షించబడ్డాయి. అనంతరం ఆమె భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ ఉదయ్ కిరణ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సేవాభావంతో విధులు నిర్వహించి మహిళ ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ



**విశాలభారతి, పాలకుర్తి:** మండలంలోని మల్లంపల్లిలో తాళ్లపల్లి ప్రేమ్ కుమార్ జ్ఞాపకార్థం అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, కంపక్స్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతోపాటు అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని విద్యార్థులు బాగా చదివి 10వ తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి మధు, ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సతీష్, సభ్యులు అఖిల్, సంజీవ, యేసు, సోమారపు సంపత్, దినేష్, వంగాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్లకు గ్రేడ్ I ప్రమోషన్స్ ఇవ్వాలి

- **డాక్టర్ మాసారం ప్రేమ్ కుమార్**



**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఇన్ సర్వీస్ లో ఉండి సోషల్ వర్క్, సోషియాలజీ చేసిన నర్సింగ్ ఆఫీసర్స్ కి గ్రేడ్I వన్ ప్రమోషన్స్ ఇవ్వాలని క్రైస్తవ జన సమితి రాష్ట్ర డాక్టర్ మాసారం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆయన రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, హెల్త్ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కు లేఖ రాశారు. "సోషియాలజీలో ఫీల్డ్ వర్క్ ఉంటుంది. దానికి సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ డిపార్ట్మెంట్ హెచ్ఓడీ చేత ఒపీనియన్ తీసుకొని ముందుకు వెళ్లాలి.ఎవరు నష్టపోకుండా అందరికీ న్యాయం జరిగేలా చూడాలి" ఆయన లేఖలో పేర్కొన్నారు.

# ఘనంగా సెల్ఫ్ గవర్నమెంట్ డే




**దేవరుప్పుల విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామ స్థానిక హరిజన కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానో పాధ్యాయులు భాస్కుల అంజయ్య తెలియజేశారు. ఇందులో భాగంగా విద్యార్థులె ఉపాధ్యాయులై వారి వారి బాధ్యతలను సక్రమంగా ఉత్సాహంగా నిర్వహించారు. గోపాల్ దాస్ సారిక మండల విద్యా అధికారిగా, ప్రధానోపాధ్యాయులుగా, రాపాక రియాన్సిక తెలుగు, రాపాక గగన శ్రీ గణితం, భత్తిని దినేష్ ఇవీఎస్, జంగా కార్తీక్ పిఈటిగా, మరియు డిఇఓగా రాపాక వరుణ్ తేజలు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా,చక్కటి ప్రతిభ కనబరిచారు. అనంతరం రివ్యూ మీటింగ్ లో పిల్లలు అందరూ, వారి వారి అనుభవాలు పంచుకున్నారు. ఆకస్మిక డిఇఓ పాఠశాలను సందర్శించి మూడవ తరగతి విద్యార్థుల ఎఫ్ఎల్ఎస్ ను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసిస్తూ ఇంకా బాగా కష్టపడి పాఠశాలలో ఎన్రోల్మెంట్ పెంచాలని, కాలనీవాసులు తల్లిదండ్రులు బాధ్యతతో బడిని బాగు చేసుకోవాలని, ఇంకా విలువైన విషయాలు సూచించారు. తదనంతరం బాస్కుల అంజయ్య మాట్లాడుతూ, మా పిల్లలు ప్రతిభగల పిల్లలు అని, చాలా చక్కటి వేషాధారణ మరియు బోధన జరిగించారని తెలియజేశారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**ఆదిలాబాద్ విశాలభారతి:** ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ భౌతిక శాస్త్రవేత్త అయిన సర్ సి.వి. రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ప్రధాన ఆచార్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ సి.వి.రామన్ గారు భౌతికశాస్త్రంలో ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్ట్ మరియు ఆయన చేసిన సైన్స్ ప్రయోగాలకు నోబెల్ ప్రైజ్ మరియు భారతరత్న పురస్కారాలు లభించాయని విద్యార్థులు అందరూ ఆదర్శంగా తీసుకొని సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని భారత దేశం అగ్రస్థానం లో నిలబెట్టడానికి తోడ్పడాలని అన్నారు. అనంతరం ఆచార్యులు విద్యార్థులతో విజ్ఞాన ప్రదర్శిని ప్రయోగాలు చేయించి వాటి గురించి వివరించారు.నీటిలో తేలే వస్తువులు, గాలి,పీడనం, జ్ఞానేంద్రియాలు, ఊపిరితిత్తుల పనితీరు, మైక్రోస్కోప్ ద్వారా ఉపయోగం,కాంతికి సంభందించిన ప్రయోగాలు,కృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆచార్యులు ఉషారాణి,సుజాత, మంజుల,భారతి,శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐరా గ్లోబల్ స్కూల్

- **ద్వితీయ వార్షికోత్సవం.. మండల విద్యాధికారి గురువారావు**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని ఐరా గ్లోబల్ స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ అంశాలపై రూపొందించిన నృత్యాలు, దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, అతిథులు హర్షాతిరేకాలతో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి పాల్గొని గురువా రావు మాట్లాడుతూ..విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అరుణ, కరస్పాండెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆలయ ప్రహరీ గోడ విస్తరణ పనులు ప్రారంభం

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలం చిన్న కొండూరు గ్రామంలోని శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ గోడ విస్తరణ పనులను ప్రారంభించిన దేవాలయ కమిటీ చైర్మన్ ఎరుకుల రాందాస్ గౌడ్ మరియు పాలకవర్గం. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షులు మాట్లాడుతూ దేవాలయ ప్రహరీ గోడ భక్తుల సౌకర్యార్థం కొరకు ముందుకు జరపడం కోసం భక్తిశ్రద్ధలతో ఈరోజు ఆలయ పూజారి



కొండూరు నరసింహ శర్మ గారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య, ఉప సర్పంచ్ గడ్డం సత్తయ్య, మరియు వార్డు సభ్యులు, దేవాలయ కమిటీ పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట

- **రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**విశాలభారతి, గోదావరిఖని:**



రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో అరైవ్ అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా వాహనదారులు మరియు ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచేందుకు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో గోదావరిఖనిలోని సింగరేణి విటిసి కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ప్రజల్లో ముఖ్యంగా యువత మరియు డ్రైవర్లలో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత అని,అయితే శాశ్వత మార్పు రావాలంటే ప్రతి వాహనదారుడు తన మనసులోనే ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలనే సంకల్పం చేసుకోవాలని సూచించారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకుని జాగ్రత్తగా వాహనం నడిపితే సుమారు 80 శాతం వరకు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. తాగి వాహనం నడపడం చిన్న తప్పు కాదని, అది తమ కుటుంబానికే కాక ఇతర కుటుంబాలకు కూడా అపార నష్టం కలిగించవచ్చని హెచ్చరించారు.ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదని, ప్రాణం ఉంటేనే అన్నీ సాధ్యమని అన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రమాదంలో తప్పు ఎవరిదన్నది కంటే, దాని వల్ల రెండు కుటుంబాలు ఇబ్బందులు పడతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని,ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, రోడ్ సేఫ్టీ పెద్దపల్లి జోన్ ఇన్‌చార్జ్ ఇన్స్పెక్టర్ రమేష్‌బాబు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్, ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, విటిసి ప్రిన్సిపల్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**విశాలభారతి, ఆదిలాబాద్:**



పదవ తరగతి పరీక్షలను పకడ్బందీ గా నిర్వహించాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 10,928 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, ఇందుకోసం 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల విధులకు సంబంధించి 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 13 మంది సికస్టోడియన్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ ద్వారా 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, అలాగే సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా పత్రాల రవాణాకు, ఫ్లయింగ్ స్క్వాడ్ల కోసం తగిన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖా అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అన్ని పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రతి కేంద్రంలో ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ట్రాన్స్ కో అధికారులకు సూచించారు. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా బస్సు వేళలను సర్దుబాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఆర్టీసీ, వైద్య, విద్యుత్, పోలీస్, రవాణా, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానంలో వివిధ పనులకు సీల్డ్ టెండర్ల ఆహ్వానం

**వలిగొండ, విశాలభారతి:**




వలిగొండ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం, వెంకటాపురం పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వివిధ వస్తువుల సరఫరా మరియు సేవల కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణ అధికారి (EO) ఎస్. మోహన్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. టెండర్ల వివరాలు: 202627 ఆర్థిక సంవత్సరానికి గాను (తేదీ: 01 042026 నుండి 31032027 వరకు) ఈ క్రింది పనులకు టెండర్లు కోరడమైనది: పులిహోర కవర్లు, బట్టర్ పేపర్ అడ్డు కవర్లు మరియు క్లాత్ క్యారీ బ్యాగుల సరఫరా. కరెంటు (ఎలక్ట్రికల్) సామాగ్రి సరఫరా. శానిటేషన్ (శుభ్రత) సామాగ్రి సరఫరా. పండుగలు, బ్రహ్మోత్సవాలకు పూలు, పూలదండలు, పండ్ల సరఫరా మరియు ఆలయ అలంకరణ. ప్రతి టెండరుకు ధరావత్తురూ. 10,000/ మరియు టెండర్ షెడ్యూల్ ధర రూ. 2,000/ గా నిర్ణయించారు. ముఖ్యమైన తేదీలు మరియు నిబంధనలు: టెండర్ షెడ్యూల్ విక్రయం: మార్చి 1, 2026 నుండి మార్చి 7, 2026 ఉదయం 11:30 గంటల వరకు ఆలయ కార్యాలయంలో లభిస్తాయి. టెండర్ దాఖలుకు చివరి సమయం: మార్చి 7, 2026 శనివారం ఉదయం 11:50 గంటల లోపు. టెండర్ల ప్రారంభం: అదే రోజు (మార్చి 7) మధ్యాహ్నం 12:00 గంటలకు సీల్ చేసి, మధ్యాహ్నం 1:30 గంటలకు టెండర్ దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారు. చెల్లింపు విధానం: ధరావత్తు మొత్తాన్ని 'కార్యనిర్వహణ అధికారి, శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వెంకటాపురం' పేరుతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (వేములకొండ శాఖ) లేదా కెనరా బ్యాంక్ (ఆరూర్ శాఖ) లలో డి.డి. తీయాల్సి ఉంటుంది. కావలసిన పత్రాలు: టెండర్ షెడ్యూల్‌తో పాటు ధరావత్తు డి.డి. మరియు ఆధార్ కార్డు జిరాక్స్ జతపరచాలి. మరింత సమాచారం కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని లేదా 9030932493, 9381824284 నంబర్లకు ఫోన్ చేయాలని ఈఓ సూచించారు.

# అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మిక తనిఖీ

**మహబూబాబాద్, డోర్నకల్:**



మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న విద్యా బోధనలను స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నూతన టెక్నాలజీ ఆధునిక పరిజ్ఞానంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతులు ప్రత్యేక తరగతుల ద్వారా పదవ తరగతి ఇతర తరగతుల విద్యార్థిని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అత్యుత్తమ ఫలితాలు సాధించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు షెడ్యూల్ ప్రకారం పాటలు సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు, డైట్ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పిల్లలకు హెల్త్, ఎడ్యుకేషన్ ,న్యూట్రిషన్, సానిటేషన్ లపై అవగాహన కల్పించాలని అన్నారు. క్రమం తప్పకుండా వారి మానసిక, ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు, ఇతనికిలో ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# శారద విద్యాపీఠం భూముల కేటాయింపుపై వివాదం తీవ్రతరం

**రాజేంద్రనగర్, విశాలభారతి:** కోకాపేట్ న్యూ పోలీస్ పరిధిలోని శారద విద్యాపీఠం ఆలయ భూముల వివాదం తాజాగా రాజకీయంగా తీవ్రరూపం దాల్చింది. కోకాపేట్ ప్రాంతంలో ఉన్న శారద విద్యాపీఠానికి చెందిన ఆలయ భూమిని ప్రభుత్వం వాటర్ బోర్డుకు కేటాయించినట్లు సమాచారం వెలువడింది. దీనికి ప్రత్యామ్నాయంగా, శంషాబాద్‌లో హెచ్ఎండిఏకు చెందిన సర్వే నంబర్ 725/19లో రెండు ఎకరాల భూమిని శారద విద్యాపీఠానికి కేటాయించినట్లు కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగినట్లు శంషాబాద్ తహసీల్దార్ రవీంద్ర దత్తు మీడియాకు వెల్లడించారు. ఈ నిర్ణయంపై రాజకీయంగా తీవ్ర ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు. ఆలయ భూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై కూడా హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శ



**కురవి విశాలభారతి:** కురవి మండలం మోదుగులగూడెం గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు రాగం రాంచంద్రు తండ్రి రాగం రాములు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాజీ రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ సీనియర్ నాయకులు నాయిని దేవేందర్ రెడ్డి, ప్రమాదవ శాత్తు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య స్థితి గతులని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమం లో బి ఆర్ ఎస్ జిల్లా సీనియర్ నాయకులు బజ్జు రి పిచ్చిరెడ్డి, బి ఆర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి నాయక్ సీనియర్నాయకులు గండి వెంకటమల్లు, పెద్దబోయిన శ్రీశైలం, కందిపాటి వెంకన్న, రాసాల రమేష్, వల్లపు నగేష్, బొంపల్లి వీరన్న, యల్ది అర్జున్, వల్లపు యాకన్న, గండి రవితేజ, కుంట కరుణాకర్, కొత్త ప్రవీణ్, యల్ది వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశభక్తి,త్యాగనిరథితో ముందుకు సాగాలి



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని కోయిలగూడెం గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు మరియు మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ స్ఫూర్తితో యువత దేశభక్తి త్యాగనిరతితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో బిజెపి పార్టీ నాయకులు మరియు పార్టీ శ్రేణులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు పాదపూజ చేసిన విద్యార్థులు

- **మానవీయ విలువలకు అద్దం పట్టిన దుప్పల్లి జడ్‌పీహెచ్‌ఎస్ వార్షికోత్సవం**




**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీ ఆర్ బీ ఆర్‌లో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి, వారి పాదాలను కడిగి పసుపు, కుంకుమలు వేసి పాదాభివందనం చేయడం హృద్యంగా సాగింది. ఈ పాదపూజ కార్యక్రమం విద్యార్థులు తమ తల్లిదండ్రుల పట్ల గౌరవం, కృతజ్ఞతను వ్యక్తపరచేలా చేసి, తల్లిదండ్రులు – పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచేలా నిలిచింది. “తల్లిదండ్రులకు సేవ చేస్తేనే జీవితంలో శ్రేయస్సు, ఆశీర్వాదాలు లభిస్తాయి” అనే గొప్ప సందేశాన్ని ఈ కార్యక్రమం సమాజానికి చాటిచెప్పింది. ఇటువంటి మానవీయ విలువలను పెంపొందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల వార్షిక నివేదికను గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పి. విజయ సమర్పించగా, ఉపాధ్యాయుల కృషిని కొనియాడుతూ వారిని సన్మానించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ డేకు సంబంధించిన నాటికలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పి. విజయ, ఉపాధ్యాయులు రాధా కిషన్, శ్రీనివాసు, చంద్రశేఖర్, విశ్వశాంతి, సోమ్లా నాయక్, మహేశ్వర్, అండాలు, యాదయ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మల్లికార్జున పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే దినోత్సవం

- **ప్రపంచ దేశాలు సైన్స్‌పై ఆధారపడుతున్నాయి**
- **మారేపల్లి మల్లారెడ్డి మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవరోజు సందర్భంగా మల్లికార్జున పాఠశాలల్లో వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలుగా ప్రయోగాలు తయారుచేసి ఆయా పాఠశాలలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లికార్జున విద్యా సంస్థల చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను విధిగా వాటిని చూసి వారి ప్రతిభకు ముగ్దులై విద్యార్థులను ప్రశంసించారు. తదనంతరం వారు మాట్లాడుతూ.. నేడు ప్రపంచ దేశాలు విజ్ఞానశాస్త్రం పైనే ఆధారపడి ఉన్నాయని, భవిష్యత్తులో కూడా సైన్సును డెవలప్ చేస్తూ ప్రపంచం ముందుకు సాగుతుందని, విద్యార్థులు ఇలానే తమ ప్రతిభను మెరుగ్గా ప్రదర్శిస్తూ,ప్రకృతి మరియు భౌతిక ప్రపంచం గురించిన అధ్యయనం చేయాలనీ,సైన్స్ అంటే ఒక పాటం కాదని,భూగోళపు దిక్సూచి అని విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య,కృష్ణ,శ్రీనివాసరావు, లక్ష్మీదేవి,కవిత,భార్గవి,సంధ్య మరియు విద్యార్థర్ధిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ శారద పీఠం, రాజశ్యామల ఆలయంపై ప్రభుత్వ కుట్ర

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం పరిధిలో ఉన్న రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రభుత్వంలో కోకాపేట్ సర్వే నెంబర్ 240లో శారద పీఠానికి చట్టబద్ధంగా, క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు రూ.1 కోటి 5 లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని, హెచ్ఎండీఏకు రూ.23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ పొందారని వివరించారు. ఇక్కడ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి



దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మాణం జరిగిందని, అప్పటి నుంచి నిత్య పూజలు కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటర్ వర్క్స్ కోసం ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని చెబుతోందని, అయితే ఆలయానికి ఎదురుగా సర్వే నెంబర్ 239, 240లలో 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ దానిని వదిలి ఆలయ స్థలాన్నే లక్ష్యంగా చేసుకోవడం అనుమానాస్పదమని విమర్శించారు. ఆ 17 ఎకరాలను "భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్" పేరిట ముఖ్యమంత్రి అల్లుడు, అనుచరులకు నామినేషన్ పద్ధతిలో కేటాయించారని ఆరోపించారు. ఓపెన్ ఆక్షన్ నిర్వహిస్తే ప్రభుత్వానికి వందల కోట్లు వచ్చేవని, కానీ ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో కిలోమీటర్ లోపల క్రషర్లు ఉండకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, ఐదు రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్లు ఏర్పాటు చేశారని అన్నారు. బిల్డర్లు తమ వద్ద నుంచే కంకర కొనాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. రాత్రి 11:30 గంటలకు నోటీసులు ఇవ్వకుండా వందలాది మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు వచ్చి పీఠాధిపతులను భయాందోళనలకు గురిచేశారని, పూజలను అడ్డుకున్నారని ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం అంటే గుళ్లు, గోపురాలు కూల్చడమేనా?" అని ప్రశ్నించిన హరీష్ రావు, దేవాలయాలపై కక్షసాధింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి ఈ దేవాలయాన్ని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకోవడం తమ బాధ్యత అని, ఎంత దూరమైనా పోరాడతామని, రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వమని హరీష్ రావు స్పష్టం చేశారు.

## ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్

**జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్**



**మహబూబాబాద్, విశాలభారతి:** శనివారం కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి జిల్లాలో ఉన్న రాష్ట్రీయ బాల స్వస్థ (ఆర్.బి.ఎస్.కె) కార్యక్రమం వైద్యాధికారులకు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, సిబ్బంది అందరికీ ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మార్చి 4 నుండి కార్యక్రమం ప్రారంభమవునని 6 సంవత్సరాల 18 సంవత్సరాల పిల్లలందరికీ, ప్రభుత్వ రెసిడెన్సి స్కూల్, పిల్లలను స్క్రీనింగ్ చేయడం, ముఖ్యంగా స్కూల్ పిల్లలో న్యూట్రిషన్ డెఫిషియన్సి గుర్తించడము, రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించడము, వ్యక్తిగత పరిశుభ్రతను, అవగాహన కల్పించడం, మానసిక రుగ్మతలను గుర్తించడము, ఒత్తిడి నివారణకు యోగా కౌన్సిలింగ్ లాంటివి నిర్వహించడము జరుగునని అన్నారు. ఈ శిబిరంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ప్రత్యూష, కె.వి.రాజు హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ ఈ ఓ స్వామి, అనిల్, కవిత, ఆర్ బి ఎస్ కే టీమ్స్ మరియు డి ఈ ఐ సి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లా వ్యాప్తంగా ఈనెల 25 తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని కలెక్టర్ శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ, బయ్యారం మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును స్వయంగా, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, త్రాగునీరు అందించాలని సూచించారు, సీసీ కెమెరాల ద్వారా నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు, జిల్లాలో (18) పరీక్ష కేంద్రాల ద్వారా మొదటి సంవత్సరం 4158, రెండవ సంవత్సరం 4129, మొత్తం 8287 విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, ఈ రోజు (3822) మంది పరీక్షలకు హాజరు కాగా, (65) మంది గైజరయ్యారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణపై ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, సమావేశాలు నిర్వహించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసామని, ప్రతీ కేంద్రానికి చీఫ్ సూపరింటెంట్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష జరిగే సమయాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. మదర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## మాతృభాషపై రవికుమార్ కవితలు అద్భుతం

**పొట్లూరి హరికృష్ణ**



**విశాలభారతి, కోదాడ:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం ప్రపంచ తెలుగు కవుల మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ కవి సమ్మేళనంలో కోదాడ ప్రాంతానికి చెందిన యువ కవి, ఎన్నారై రేడియో వ్యాఖ్యాత రవికుమార్ రాసిన కవిత ఉత్తమ కవితగా ఎంపికై పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ నవ ధూర్జటి బిరుదాంకితుడైన రవికుమార్ మాతృభాషపై ఉన్న మక్కువతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని సృష్టిస్తున్నారని కొనియాడారు. తెలుగు భాషా వికాసానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



**విశాలభారతి, కోదాడ:** సివి రామన్ పరిశోధన ఫలితాన్ని పురస్కరించుకొని నేషనల్ సైన్స్ డే గా శనివారం శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాని ముఖ్య అతిథులుగా ఈజీఎమ్ మురళీకృష్ణ, ఆర్ఐ దండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన జ్ఞానాన్ని సంపాదించుకుంటూ ఆ జ్ఞానంతో అభివృద్ధి చెందుతూ మంచి విజయాలు సాధించాలని కోరారు. విద్యార్థులు సివి రామన్, అబ్దుల్ కలాం లాంటి మేధావులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. నేడు ప్రపంచంలో మొత్తం సైన్స్ మీదనే ఆధారపడి నడుస్తుందని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపాల్ గోపాలస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల సాధన దీక్షను విజయవంతం చేయండి

- **రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పానుగోటి కోటయ్య**



**విశాలభారతి, కోదాడ:** రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల కోసం మార్చి 2 నుండి 5 వరకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి చేపట్టే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పానుగోటి కోటయ్య కోరారు. కోదాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ బాలేమియా, షేక్ హుస్సేన్, మణిరం, ఆర్ వెంకటేశ్వర్లు, సిరంగి నరసింహారావు, జయమ్మ, వరప్రసాదరావు, వేములకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- **ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి జిల్లా అధ్యక్షులు శ్రీధర్**



**ఆర్మూర్,విశాలభారతి:** నందిపేట్ లోని పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ప్రెసిడెంట్ బోయిని శ్రీధర్ ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పానీయాల నిర్మూలన పైన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువత మత్తుకు బానిస కాకూడదని, విలువైన బంగారు భవిష్యత్ పాడు చేసుకోవద్దని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిపేట్ డాక్టర్ సౌమ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, నందిపేట్ మండల్ చైర్మన్ బెగరి సంజీవ్, నిజామాబాద్ డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్ కట్ట రాజు, తదితరులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడం వలన కాలేజీ ప్రిన్సిపల్ గారు ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి సంస్థ ప్రతినిధులను అభినందించడం జరిగింది.

## సిమ్స్‌లో క్రాకింగ్ ది కోడ్ ఆఫ్ ఒబేసిటీ ఫ్రమ్ మాలిక్యూల్స్ టు మెడిసిన్



**విశాలభారతి, గోదావరిఖని:** సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సిమ్స్‌లో క్రాకింగ్ ది కోడ్ ఆఫ్ ఒబేసిటీ ఫ్రమ్ మాలిక్యూల్స్ టు మెడిసిన్ అనే పేరుతో నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి సి పి డి కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం ఊబకాయం యొక్క కారణాలు, నివారణ మరియు నిర్వహణపై దృష్టి సారించింది. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు చెందిన బారియాట్రిక్ సర్జన్ డాక్టర్ జైదీప్ నేత శస్త్రచికిత్స నిర్వహణపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు, ఆయన అధునాతన బారియాట్రిక్ విధానాలు మరియు వాటి ఫలితాలను వివరించారు.సిమ్స్ ఫ్యాకల్టీ సభ్యులు ఊబకాయాన్ని ఎదుర్కోవడంలో బహుళ విభాగ విధానం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేందర్ మార్గదర్శకత్వంలో జరిగింది. దీనిని డాక్టర్ ప్రదీప్ చంద్ర నిర్వహించారు.వివిధ రాష్ట్ర ఆసుపత్రులు మరియు వైద్య కళాశాలల వైద్యులు చురుకుగా పాల్గొన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మరియు సీనియర్ రెసిడెంట్ల కోసం పరిశోధన పోస్టర్ పోటీ కూడా నిర్వహించబడింది. మరియు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి పాల్గొనేవారి నుండి ప్రోత్సాహకరమైన స్పందన లభించింది.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**మహబూబాబాద్, విశాలభారతి:**



స్థానిక మహబూబాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ నందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్ సివి రామన్ ప్రపంచాన్ని కందించిన రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించిన రోజుని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల చైర్మన్ కే చంద్రమౌళి సర్ సివి రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ధూప దీప నైవేద్యాలతో టెంకాయని సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవను మరియు ప్రత్యేకంగా సైన్స్ పట్ల ప్రపంచానికి అందించిన జ్ఞానాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు.భారతీయ పౌరుడై ప్రపంచానికి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నేర్పరచుకొని అందుకోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి తెలియజేశారు. అదేవిధంగా 2026 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని వీక్షిత్ భారత్ గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని దీని యొక్క ముఖ్య ఉద్దేశం విజ్ఞాన శాస్త్రంలో మహిళలను ప్రోత్సహించాలని తద్వారా సమాజంలో మహిళల యొక్క కీలకపాత్రను మరియు అభివృద్ధి చెందిన భారతదేశంలో నిర్మించడమే ఈ యొక్క జాతీయ దినోత్సవం యొక్క ముఖ్య లక్షణమని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులు ఎంతో సృజనాత్మకతతో, శాస్త్రీయ దృక్పథంతో తయారు చేసుకొచ్చిన సైన్స్ ప్రదర్శనలను తిలకించి, వారిని అభినందిస్తూ, మంచి ప్రదర్శనను తయారుచేసిన విద్యార్థిని విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులలో చిన్నతనం నుండి శాస్త్రీయ వైఖరి మరియు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండి భారతదేశానికి సైన్స్ రంగంలో సర్ సివి రామన్ వలే ప్రతి ఒక్కరూ సేవ చేయాలని అభిలాషించారు. స్వస్తిక్ స్కూల్ నందు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క భవిష్యత్తు కోసం అంకితభావంతో నిరంతరం కృషి చేస్తున్నారని, విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన సైన్స్ ఎగ్జిబిట్లు ను విద్యార్థిని విద్యార్థులు కన్నుల పండగ నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ కె చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు దాసరి మధు సైన్స్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థి విద్యార్థులు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైభవంగా శోభారాణి పదవీ విరమణ మహోత్సవం

**పులిగొండ, విశాలభారతి:**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ అప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలం సేవలందించిన శ్రీమతి కేశవదాసు శోభారాణి గారు శనివారం ఘనంగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం వైభవంగా జరిగింది. తన సేవా కాలమంతా అంకితభావంతో పనిచేసిన శోభారాణి గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో విశేష పాత్ర పోషించారు. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం మాట్లాడుతూ, "శోభారాణి సేవలు గ్రామానికి ఎంతో మేలు చేశాయి. ఆరోగ్య శాఖలో ఆమె చూపిన కర్తవ్యనిష్ఠ అందరికీ ఆదర్శం. ఆమె చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి" అని అన్నారు. ఉపసర్పంచ్ శ్రీ అంబటి సాయికుమార్ మాట్లాడుతూ, "ప్రతి బాధ్యతను కుటుంబ సభ్యురాలిలా భావించి నిర్వర్తించిన శోభారాణి నిజమైన సేవాభావం కలిగిన ఉద్యోగి. ఆమె భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో నిండాలని కోరుకుంటున్నాం" అని శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులి పంపుల రాములు గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రసూల్, జడిగే సత్తయ్య, రిపోర్టర్ భగవంతు తదితరులు పాల్గొని శోభారాణిని ఘనంగా సన్మానించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

## కిడ్నీ బాధితులకు అండగా ఎమ్మెల్యే జారే

- **కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిర్మలను పరామర్శించిన ఎమ్మెల్యే**
- **మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు పంపించే ఏర్పాట్లు**
- **మానవతా దృక్పథంతో ప్రజల మనసు గెలిచిన ప్రజాప్రతినిధి**

**అశ్వారావుపేట, విశాలభారతి:**

అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మినుగుల నిర్మల కన్నయ్యను స్వయంగా కలిసి పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వైద్యానికి పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ దేరంగుల ప్రసాద్ బాధిత కుటుంబ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిర్మల పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ లో చేర్పించాలని సూచిస్తూ, అవసరమైన ఏర్పాట్లను ప్రత్యేక శ్రద్ధతో చూసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, మండల యువజన నాయకుడు జూపల్లి ప్రమోద్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, దేరంగుల ప్రసాద్, దగ్గుమిల్లి నరేంద్ర, పసుపులేటి రామస్వామి తదితర ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కిడ్నీ బాధితులకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే జారేను స్థానిక ప్రజలు ప్రశంసలతో ముంచెత్తారు.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం




**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సూధనపల్లి లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్ )అయిన శ్రీ ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న సార్ ను తోటి ఉపాధ్యాయులంతా మెమొంటో, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకన్న మాట్లాడుతూ ఈరోజున ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త అయిన భారతదేశానికి చెందిన సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్ ను ఆవిష్కరించిన రోజు, ఈ రామన్ ఎఫెక్ట్ ద్వారా సి.వి .రామన్ కి నోబెల్ ప్రైజ్ రావడం జరిగింది. ఈ రోజును పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28 ని జాతీయ సైన్స్ దినోత్సవం గా జరుపుకోవాలని సూచించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్, ఎండి .అంజద్ పాషా, గాండ్ల బాలరాజు, బి. సరోజ, వి.శుభ, కే. సారంగం, ఏ ప్రగతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమశెట్టి ధనమ్మ , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళ్ళ సంకీస గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి



**మహబూబాబాద్, విశాలభారతి:** తాళ్లసంకీస గ్రామ అభివృద్ధికై ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ ని కోరారు. హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ని కలిసిన అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు కామ సంజీవరావు, ప్రతాపని పుల్లయ్య లు తాళ్ల సంకీస గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదని, దళితుల అత్యధికంగా కలిగి ఉన్నందున గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి సహకారం అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసి, వినతి పత్రం అందించగా, డాక్టర్ రామచంద్రనాయక్ సానుకూలంగా స్పందించారు.

## జడ్పీహెచ్ఎస్ బేల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బేల మండలం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించే లక్ష్యంతో పాఠశాలలో వివిధ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం, రంగోలి పోటీలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదనంగా, విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణకుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని సైన్స్ రంగంలో ముందంజలో ఉండాలని సూచించారు. కార్యక్రమానికి డ్రీం స్వచ్ఛంద సంస్థ సిఎంఓ కృష్ణా రెడ్డి, చైర్మన్ మమత రెడ్డి హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు రూ.7,000 విలువైన సైన్స్ మెటీరియల్‌స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. సైన్స్ దినోత్సవ వేడుకలు పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

## ఘనంగా జాతీయ దర్జీల దినోత్సవం

- **దర్జీలకు ఫెంక్షన్స్ అందించాలి.. మార సంగమేశ్వర్ సంఘం అధ్యక్షులు**




**చౌటుప్పల్, విశాల భారతి:** పట్టణ కేంద్రంలోని జెంట్స్ అండ్ లేడీస్ టైలరింగ్ అసోసియేషన్ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షులు మారా సంగమేశ్వర్ ఆధ్వర్యంలో జాతీయ దర్జీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ రహదారి వెంట ర్యాలీ నిర్వహించి,అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చౌటుప్పల్ జెంట్స్ అండ్ లేడీస్ టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు మారా సంగమేశ్వర్ మాట్లాడుతూ దర్జీలకు ఉచిత విద్యుత్,ఉచిత భీమా,హెల్త్ కార్డులను రుణాలను మంజూరు చేయాలని మరియు ఐదు సంవత్సరాలు నిండిన టైలర్లకు ఫెంక్షన్స్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు.ఇండ్లు,ఇండ్ల స్థలాలు లేనివారికి ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. తదనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌరవాధ్యక్షులు ఆదిమూల శంకర్ మరియు రాపోలు ఈశ్వరులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెంట్స్ అండ్ లేడీస్ టైలరింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వనమా దశరథ ప్రధాన కార్యదర్శి గుంటి వెంకటేశ్వర్లు కోశాధికారి బడుగు కృష్ణ సహాయ కార్యదర్శి సురం భూమేష్ గౌరవ సలహాదారులు కొంగరి కనకయ్య చిలువేరి కృష్ణ కోక్కు సోమేశ్ కార్యవర్గ సభ్యులు దశరథ,వెంకటేష్,నరసింహ,యాదగిరి,గణేష్,భాస్కర్,రవి,వెంకటేష్ మరియు పాల్గొన్నారు.

# గ్రామాల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు**

**విశాలభారతి, కరకగూడెం:**



మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుదల కోసం ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామాల్లో తరచుగా ఎదురవుతున్న లో వోల్టేజ్ సమస్యలు మరియు విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఎంతో ఉపయోగపడనున్నాయని తెలిపారు. వట్టం వారి గుంపు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో రూ. 3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. చిరుమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని పోల్కమ్మతోగు గ్రామంలో రూ. 3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన విద్యుత్ సరఫరా వ్యవసాయం, గృహ వినియోగం మరియు చిన్న వ్యాపారాల అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ నరహరి రాజశేఖర్, ఎమ్మార్వో కాంతయ్య, ఎంపీడీవో కుమార్ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అలాగే సర్పంచ్‌లు బట్టుపల్లి తోలెం రమాదేవి, కరకగూడెం పోలేబోయిన సుజాత, చిరుమల్ల కొమరం సుగుణ, వెంకటాపురం చౌలం కేశవరావు, పద్మాపురం తోలెం రమేష్,చొప్పాల తోలెం సావిత్రి, గొల్లగుడెం ఎల్లబోయిన ముత్తమ్మ గారు, కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య,, ఎర్ర సురేష్,రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, పోలేబోయిన శ్రీవాణి తిరుపతయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు ఘన సత్కారం

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**విశాలభారతి, గోదావరిఖని:** తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని, ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు ఇకనుంచి వారి కుటుంబాల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబ ర్ కిషోర్ ఝా శనివారం ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్సై నక్క శామ్యూల్ పాల్ సీసీఎస్ మంచిర్యాల, ఎస్సై నూనే శ్రీనివాస్ మందమర్రి ఏ ఎస్ ఐ హెచ్ వెంకటేష్ బాబు గోదావరిఖని వన్ టౌన్, ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీముద్దీన్ సి ఏ ఆర్ రామగుండం, హెడ్ కానిస్టేబుల్ ఎం విజేందర్రెడ్డి జూలపల్లిని పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతోపాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమంకన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతోపాటు కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన వారున్నారన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆర్ ఐలు శేఖర్, మల్లేశం, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగంతోపాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యోతి రమేష్‌కు ఘనంగా సన్మానం



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని 14వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ ని చౌటుప్పల్ మండల ఫోటో మరియు వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం చౌటుప్పల్ మండల అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉడుగు జ్యోతి రమేష్‌గౌడ్‌కు శాలువా కప్పి,మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత సేవ చేయాలని చౌటుప్పల్ మండలం ఫోటో&వీడియోగ్రాఫర్ సంఘం సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి ,జిల్లా సలహాదారులు విశ్వనాథ్ చంద్రశేఖర్,సహాయ కార్యదర్శి రోషణగారి రాఘవేంద్ర గౌడ్, చింతల గణేష్,కందగట్ల కృష్ణ,దోర్నాల వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల జోలికి వెళ్లొద్దు

**ప్రభుత్వానికి ఎన్. రామచందర్ రావు హెచ్చరిక**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** కోకాపేట్‌లోని రాజశ్యామల ఆలయ భూముల వ్యవహారంపై బీజేపీ సీనియర్ నేత ఎన్. రామచందర్ రావు ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేశారు. ప్రభుత్వం తన నిర్ణయం నుండి వెనక్కి తగ్గినట్లు సమాచారం వస్తోందని, అదే నిజమైతే అది స్వాగతించదగ్గ పరిణామమని ఆయన తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలోని కోకాపేట్ ప్రాంతంలో నిర్మితమవుతున్న శారదా పీఠం, రాజశ్యామల దేవాలయానికి గత ప్రభుత్వం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని హైదరాబాద్ మెట్రోపోలిటన్ వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు కు అప్పగించాలని ప్రస్తుత ప్రభుత్వం యోచించినట్లు సమాచారం వెలువడింది. ఈ నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాంగణంలో పేద విద్యార్థులకు ఉచితంగా వేద విద్య బోధన జరుగుతోందని రామచందర్ రావు గుర్తుచేశారు. గత ప్రభుత్వం చట్టబద్ధంగా కేటాయించిన భూములను తిరిగి తీసుకోవడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన విమర్శించారు. లౌకికవాదం పేరుతో ఒక వర్గానికి చెందిన ఆధ్యాత్మిక, విద్యా సంస్థల పట్ల వివక్ష చూపడం తగదని హితవు పలికారు. ఈ ఉదయం మీడియా ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. "దేవాలయ భూముల జోలికి వెళ్లొద్దు, భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు" అని చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోందని తెలిపారు. మతపరమైన కట్టడాలు మరియు విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించకుండా, ప్రజల మనోభావాలకు గౌరవం ఇవ్వాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.


## లంచం తీసుకుండగా పట్టుబడ్డ హోమ్ గార్డ్ నాగేష్, డాక్టర్ సందీప్

**రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేసిన ఫోరెన్సిక్ డాక్టర్ సందీప్**



**కీసర,విశాలభారతి:** కీసర పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోం గార్డు నాగేష్,గాంధీ హాస్పిటల్ ఫోరెన్సిక్ డాక్టర్ సందీప్ లంచం తీసుకుంటుండగా శనివారం ఔటర్ రింగ్ రోడ్డు వద్ద రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.గాంధీ హాస్పిటల్ డాక్టర్ సందీప్,హోమ్ గార్డు ఇద్దరు కలసి బాధితునీ వద్ద 40 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు.అక్టోబర్ 2025 సంవత్సరం కీసర నితిన్ హాస్పటల్ లో చికిత్స పొందుతూ తోటకూర మహేష్ యాదవ్ మృతి అనే వ్యక్తి మృతి చెందాడు.ఇట్టి విషయంలో మహేష్ యాదవ్ మేనల్లుడు శరత్ యాదవ్ గాంధీ హాస్పిటల్ పీఎంఓ రిపోర్ట్ కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాడు.చివరికి కీసర పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించే హోం గార్డ్ మెడికల్ సర్టిఫికెట్ చూసే నాగేష్ ను కలవగా గాంధీ హాస్పిటల్ ఫోరెన్సిక్ డాక్టర్ సందీప్ రెండు లక్షల రూపాయల డబ్బులు అడుగుతున్నాడు అని చెప్పడం జరిగింది.డబ్బులు ఇస్తే తప్ప పని కాదు అని అనుకున్న శరత్ యాదవ్ చివరికి 40 వేల రూపాయలు రెండు రోజుల్లో ఇస్తా అని ఒప్పుకున్నాడు.బాధితుడు శరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి శనివారం హోమ్ గార్డు నాగేష్,గాంధీ హాస్పిటల్ ఫోరెన్సిక్ డాక్టర్ సందీప్ లను ఏసీబీ అధికారులకు పట్టించాడు.డాక్టర్ సందీప్,హోమ్ గార్డు నాగేష్ లను కీసర పోలీస్ స్టేషన్లో విచారణ చేసి అనంతరం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన ఏసీబీ అధికారులు.

## రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్ బి నగర్ నియోజకవర్గం హయత్‌నగర్ పాత గ్రామంలోని హయత్ నగర్ తోట్లబస్తీలో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న జాంబవంతు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శనివారం శుభారంభం జరిగింది. స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమక్షంలో బోర్ వేయడం ద్వారా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోట్లబస్తీ ప్రజలకు చాలా కాలంగా కమ్యూనిటీ హాల్ అవసరం ఉన్నదని గుర్తించి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. భవనం పూర్తయిన తర్వాత బస్తీ ప్రజలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీ భేదాలు లేకుండా ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. హయత్‌నగర్ పాత గ్రామ అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభమైనందుకు స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ కళ్లెం నవజీవన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జాంబవంతు యువజన సంక్షేమ సంఘం సభ్యులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హోటల్ తనిఖీ చేసిన జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారు



**సికింద్రాబాద్,విశాలభారతి:** సికింద్రాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారు కవాడిగూడలోని ఓ హోటల్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. శనివారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం పరిధిలోని కవాడిగూడ అమంత్రాన్ హోటల్లో అధికారులతో కలిసి ఆమె ప్రత్యేక తనిఖీ చేపట్టారు. శుభ్రత పై పలు విషయాలను హోటల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శుభ్రతతో పాటు నాణ్యత పాటించాలని హోటల్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మంగతాయారు మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు హోటల్ ల తనిఖీ చేపడుతున్నామన్నారు. ఈ తనిఖీలో తమకు కొన్ని ఎక్స్పైరీ ప్రొడక్ట్స్ లభించాయని వాటిని స్వాధీనపరుచుకున్నామని తెలిపారు అందుకు హోటల్ యజమానికి నోటీసులు జారీ చేశా మన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, ఏఎంసి ప్రవీణ్, లక్ష్మీకాంత్, సాహితి, తదితరులు పాల్గొన్నారు.

## ఇతర మండలాల్లో ఇంటర్ ఇన్విజిలేషన్ విధులకు ఉపాధ్యాయుల రిలీవింగ్ ఆదేశాలు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో భాగంగా ఇతర మండలాల్లో ఇన్విజిలేషన్ విధులకు నియమించబడిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం విడుదల చేసిన ఆదేశాల ప్రకారం, 28022026 తేదీన జారీ చేసిన రిలీవింగ్ ఆర్డర్స్ మేరకు సంబంధిత ఉపాధ్యాయులు తమ ప్రస్తుత పాఠశాలల నుంచి విధుల నుంచి విముక్తి పొంది, కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో సమయానికి హాజరుకావాల్సిందిగా సూచించారు. పరీక్షలు పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పరీక్షల విజయవంతానికి సహకరించాలని హయత్ నగర్ మండలం ఎంఈఓ శ్రీనివాస్ కోరారు.

## సీబీఐటీ లో ఒక రోజు జాతీయ నాయకత్వ సదస్సు



**హైదరాబాద్, విశాలభారతి:** చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో "ఉన్నత విద్యాసంస్థల్లో అకాడమిక్ మరియు పరిపాలనా నాయకత్వం: సుశాసనం, బాధ్యత, జవాబుదారీతనం మరియు పాత్ర స్పష్టతకు మార్గాలు" అనే అంశంపై ఒక రోజు జాతీయ నాయకత్వ సదస్సు 28 ఫిబ్రవరి 2026న సీబీఐటీ అసెంబ్లీ హాల్‌లో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిపాలకులు, విధాననిర్మాతలు మరియు విద్యారంగ నాయకులు పాల్గొని, ఉన్నత విద్యాసంస్థల్లో నాయకత్వ పద్ధతులను బలోపేతం చేయడంపై సవివరంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ ప్రసాంత మహాపాత్ర, ఐఏఎస్ (విరమణ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన ముఖ్యోపన్యాసంలో ఉన్నత విద్యా భవిష్యత్తును నిర్మించడంలో పారదర్శక పాలన, జవాబుదారీతనం మరియు దూరదృష్టి నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.


## సబ్ ఇన్స్పెక్టర్ నరసింహారావు పదవీ విరమణ



**విశాలభారతి:** నరసింహారావును మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. మల్కాజ్గిరి సీపీ అవినాష్ మహంతి ఐపిఎస్ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్, ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ ఇందిరా, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రా రెడ్డి, కో ఆపరేటివ్ ఏఓ ప్రదీప్, కో ఆపరేటివ్ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుర ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**నూతన భవనానికి మంజూరు ప్రకటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**విశాలభారతి , కరకగూడెం :** మండలం వట్టం వారి గుంపు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న మెనూ, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు మరియు పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, హాస్టల్ సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటుందని తెలిపారు. హాస్టల్‌కు నూతన భవనం మంజూరు చేయించిన విషయాన్ని విద్యార్థులకు మరియు అధికారులకు తెలియజేస్తూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రరావు , వార్డెన్ రవీందర్ , ఎంఆర్ఓ వి. కాంతయ్య , ఎంపీడీవో కుమార్ , మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, అలాగే సర్పంచ్‌లు బట్టుపల్లి తోలెం రమాదేవి, కరకగూడెం పోలేబోయిన సుజాత , చిరుమల్ల కొమరం సుగుణ వెంకటాపురం చౌలం కేశవరావు , చొప్పాల తోలెం సావిత్రి , గొల్లగుడెం ఎల్లబోయిన ముత్తమ్మ , కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, పోలేబోయిన శ్రీవాణి , తిరుపతయ్య , మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మొయినాబాద్ నుండి శంషాబాద్ బస్సు సర్వీసులు పునఃప్రారంభం

**వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి కృషి ఫలితం**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ నుండి శంషాబాద్ వరకు బస్సు సర్వీసులు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. వెంకటాపూర్ సర్పంచ్ పెద్దవేటి అర్చన అజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎలుగుల ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దవేటి విజయ్ కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు మరియు యువకులు కలిసి TSRTC రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణా రెడ్డిని కలిసి తమ రూట్‌లో గ్రామాలకు బస్సులు నడపాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను వివరంగా విన్న డిపో మేనేజర్ వెంటనే స్పందించి బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సోమవారం నుండి మొయినాబాద్ నుండి శంషాబాద్ వరకు సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, మల్కారం, నర్కుడ గ్రామాల మీదుగా ప్రతిరోజూ నాలుగు ట్రిప్పులు బస్సులు నడవనున్నాయి. ఈ నిర్ణయంతో గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు సౌకర్యవంతంగా ప్రయాణించగలరని సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ప్రముఖుల మధ్య అంత్యక్రియలు

- **ఆయా పార్టీల నాయకులు ప్రముఖులు సంతాపం**
- **నివాళులర్పించిన మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి**
- **ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు దేవాలయ అభివృద్ధి చేసిన ప్రముఖ వ్యక్తి సౌందర్య రాజన్ అంత్యక్రియలు వేలాది మంది నాయకులు భక్తుల మధ్య అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు ప్రొఫెసర్ సౌందర్యరాజన్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలను వారి కుటుంబ సభ్యులు శనివారం మంత్రోచ్చారణాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు గ్రామం తోపాటు దేవుని వెంకటాపూర్ బాలాజీ టెంపుల్ ఆవరణలో భక్తులందరూ దుఃఖ సముద్రంలో మునిగిపోయారు. ప్రముఖులు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి తోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరువు రాజు, విశ్వకర్మ మండల సీనియర్ గౌరవ అధ్యక్షుడు వడ్ల నరసింహ చారి, ప్రస్తుత అధ్యక్షులు రాంపల్లి సంతోష్ కుమార్, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బైకని చెన్నయ్య యాదవ్, గుణుగుర్తి చిన్న అలియాస్ మున్నా దర్శన్, మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, సిద్ధాంతి నరసింహ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్, చదువు శ్రీలత రాంచందర్, గౌర అనసూయ, గనుగుర్తి శిరీష కిరణ్ కుమార్ తోపాటు జంట నగరాల నుంచి వివిధ జిల్లాల నుంచి ఆయా ప్రాంతాల నుంచి ఆయా రాష్ట్రాల నుంచి అభిమానులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయింది. దీంతో మొయినాబాద్ పోలీసులు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రజలకు అన్ని ఏర్పాట్లు నిర్వహించడంతో చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజ్యం అంత్యక్రియలు సజావుగా ముగిశాయి.

## శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు




**బోడుప్పల్, విశాలభారతి:** బోడుప్పల్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. విద్యార్థులు అందరు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారత భౌతిక శాస్త్రవేత్త అయిన సర్ సి.వి. రామన్ ప్రభావాన్ని మరియు సైన్స్ యొక్క గొప్ప తనాన్ని ప్రాజెక్టుల రూపంలో విద్యార్థులు ఎంతో చాకచక్యంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రాజెందర్ విద్యార్థులకు విలువైన మాటలను అందించారు. సైన్స్ యొక్క ప్రాముఖ్యం గురించి తెలుపుతూ ఎ.జి.యమ్ రెహమాన్ అలి అకడమిక్ కో ఆర్డినేటర్స్ డి. రమేష్ మరియు తులసి, ప్రిసిపల్ ఎ. రాజెందర్, డీన్ ఆర్. దీపక్,సి. బ్యాజ్ ఇంచార్జ్ నరేష్, మరియు ప్రైమరీ ఇంచార్జ్ రేఖాసాయి, సైన్స్ బోధన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థులు చేసిన ప్రాజెక్టు ప్రదర్శనలను తల్లిదండ్రులు మరియు పాఠశాల పరిధిలోని ప్రజలు వీక్షించి ఎంతో ఆనందించి అభినందనలు తెలిపారు.

## సోమలింగేశ్వర స్వామి 19వ వార్షికోత్సవ వేడుకలు

**గ్రామ సర్పంచ్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా స్వామి వారి కళ్యాణం**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం చిన్న రవీర్యాల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ మాణిక్యాంబ సమేత సోమలింగేశ్వర స్వామి దేవాలయ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారి కళ్యాణం, రథోత్సవం శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ, స్వామివారి 19వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి సహకరించిన గ్రామ పెద్దలు, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి కళ్యాణం, రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి, భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సద్దుపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు చెరుకు భాగ్యలక్ష్మి, బండారు సత్యనారాయణ, నా రెడ్డి రిషిత సతీష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, గ్రామ పెద్దలు కారెడ్ల వసుమతి ఎల్లారెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు బండారు అనిత మల్లేష్, ఆకిటి రామకృష్ణారెడ్డి, అబ్బావతి బాలయ్య, రాపోలు మల్లేష్, అర్చకులు మాడ్గుల నారాయణ శర్మతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## రేటింగ్ ఆధారంగా సేవింగ్స్

IGBC రేటింగ్‌లో సర్టిఫైడ్, సిల్వర్, గోల్డ్, ప్లాటినం స్థాయిలు ఉన్నాయి. ప్లాటినం రేటింగ్ పొందిన భవనాలు 25–30 శాతం వరకు అదనపు సేవింగ్స్ అందిస్తాయని అభివృద్ధిదారులు చెబుతున్నారు. నిర్మాణ ఖర్చు సాధారణ ప్రాజెక్టులతో పోలిస్తే 8–10 శాతం ఎక్కువైనా, దీర్ఘకాలంలో లాభదాయకంగా మారుతుందని కొనుగోలుదారులు భావిస్తున్నారు. గ్రీన్ ప్రాజెక్టులకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో ప్రాపర్టీ విలువలు మెరుగ్గా నిలుస్తున్నాయి. రీ-సేల్ మార్కెట్‌లోనూ మంచి స్పందన లభిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయి. పర్మిట్ ఫీజుల్లో 20 శాతం వరకు రాయితీ, ఇంపాక్ట్ ఫీజుల్లో తగ్గింపు, వేగవంతమైన క్లియరెన్స్‌లు, అదనపు FAR, తక్కువ వడ్డీ రేట్లు వంటి ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి.

# హైదరాబాద్‌లో గ్రీన్ హోమ్స్ జోరు

## ఆరోగ్యం, ఆదా, సుస్థిరాభివృద్ధి ఉండే పచ్చని పొదరిండ్లకే మొగ్గు

నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొత్త ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సాంప్రదాయ గృహాల కంటే "గ్రీన్ హోమ్స్" వైపు కొనుగోలుదారులు భారీగా మళ్లుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనం, విద్యుత్-నీటి ఆదా, దీర్ఘకాలిక పెట్టుబడి రాబడికి అవకాశం ఉండటంతో మూడు కారణాలు ఈ మార్పుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. నగరంలో Indian Green Building Council (IGBC) సర్టిఫికేషన్ పొందిన ప్రాజెక్టులు 720కి పైగా నమోదయ్యాయి. అందులో 246 రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ఉండటం గమనార్హం. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం వచ్చే రెండేళ్లలో సుమారు 75 వేల గ్రీన్ ఇళ్లు మార్కెట్‌లోకి రానున్నాయి. - హైదరాబాద్, విశాలాభారతి



### కాలుష్యానికి చెక్... ఆరోగ్యానికి ప్లస్

వేసవి తీవ్రత, గాలి కాలుష్యం, అలెర్జీలు, శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబాలు ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణం కోసం గ్రీన్ ప్రాజెక్టులను ఎంచుకుంటున్నాయి. ఈ ఇళ్లలో సౌర శక్తి వినియోగం, వర్షపు నీటి సేకరణ, నీటి రీసైక్లింగ్ వ్యవస్థలు, శక్తి ఆదా పరికరాలు, సహజ కాంతి–గాలి ప్రవేశం వంటి అంశాలు ప్రధానంగా ఉంటాయి. ఫలితంగా విద్యుత్, నీటి వినియోగం 20 నుంచి 50 శాతం వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. యుటిలిటీ బిల్లుల్లో ప్రతి ఏడాది గణనీయమైన ఆదా అవుతుంది.



### నగరంలో గ్రీన్ జోరు...

కొల్లూరు, కోకాపేట, పటాన్చెరువు, షేక్‌పేట్, తెల్లాపూర్, కొంపెల్లి వంటి ప్రాంతాల్లో IGBC ప్రీ-సర్టిఫైడ్ ప్రాజెక్టులు అధికంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో చదరపు అడుగు ధర రూ.4,500 నుంచి రూ.10,000 వరకు ఉంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 48 బిలియన్ కిలోవాట్ గంటల శక్తి, 330 బిలియన్ లీటర్ల నీరు ఆదా అయినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కార్బన్ ఉద్గారాలు తగ్గడం ద్వారా పర్యావరణానికి దీర్ఘకాల ప్రయోజనాలు లభిస్తున్నాయి. అనేక కుటుంబాలు ఇప్పటికే గ్రీన్ హోమ్స్‌లోకి మారి ఆరోగ్యకర జీవనాన్ని ఆస్వాదిస్తున్నాయి. 2026లో ఈ ట్రెండ్ మరింత బలపడే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం సస్టైనబుల్ లివింగ్ వైపు వేగంగా అడుగులు వేస్తుండటం గమనార్హం.

# నిర్మాణ రంగానికి కొత్త దశ

## బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ సమావేశం

నిర్మాణ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ మీటింగ్ 2025–26 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని రిసార్ట్ లో జరిగిన ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నిర్మాణ రంగ నిపుణులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్మాణ రంగంలో నాణ్యత ప్రమాణాల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, మౌలిక వసతుల విస్తరణ, ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.
- హైదరాబాద్, విశాలభారతి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండబోదని, వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా 'విజన్ 2047' దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, సుస్థిర నిర్మాణ విధానాలను అనుసరించాలని సూచించారు. నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక ఇంజిన్‌లా పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల పెంపు, అనుబంధ పరిశ్రమల వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, అన్ని రంగాలు ఈ రంగంతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం, నిర్మాణ రంగం పరస్పర సహకారంతో పనిచేస్తే రాష్ట్రం మౌలిక వసతుల పరంగా దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పలువురు ప్రతినిధులు ప్రస్తుత సవాళ్లు, ముడిసరుకు ధరల మార్పులు, అనుమతుల ప్రక్రియలో సరళీకరణ అవసరం వంటి అంశాలను ప్రస్తావించారు. నిర్మాణ రంగానికి అనుకూల విధానాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో పరస్పర చర్చలు కొనసాగాయి. నిర్మాణ రంగ భవిష్యత్ వ్యూహాలపై తీసుకున్న నిర్ణయాలు రంగానికి దిశానిర్దేశంగా మారనున్నాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.









## ఎన్ హెచ్ 65పై ఘోర రోడ్డు ప్రమాదం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**

విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65 పై ఈరోజు ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామోజీ ఫిల్మ్ సిటీ ప్రధాన గేటు ఎదురుగా, విజయవాడ వైపు వెళ్లే ఎన్‌హెచ్ 65 రోడ్డుపై ఉదయం సుమారు 9.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బ్రహ్మణవాడ, బేగంపేట్‌కు చెందిన వరికుప్పల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తర్నాక ప్రాంతంలోని వడ్డెర బస్తీ, మణికేశ్వర్ నగర్‌కు చెందిన గండికోట లలిత (41) అనే మహిళ మేసన్ చెపురి లింగస్వామితో కలిసి కార్మిక పనుల కోసం హోండా షైన్ బైక్ (TS05FN5095) పై తర్నాక నుండి అబ్దుల్లాపూర్‌మెట్ వైపు వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా మరియు నిర్లక్ష్యంగా వచ్చిన లారీ (AP16TS3366) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలిత రోడ్డుపై కుడి వైపుకు పడిపోగా, లారీ ఆమె తలకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మేసన్ లింగస్వామి ఎడమ వైపుకు పడిపడి గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి వెల్లడించారు.

## తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్పూర్, బండ్లగూడ, హైదర్ షాకోట్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో తాగునీటి సమస్యలపై ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ , రాజేంద్రనగర్‌కు కొత్తగా నియమితులైన హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి వాటర్ డిపార్ట్‌మెంట్ డీజీఎం జవహర్ అలీ గారిని సమావేశానికి ఆహ్వానించి రాబోయే వేసవి కాలంలో పాత గ్రామాలు మరియు కాలనీలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా సమృద్ధిగా ఉండేలా అవసరమైన అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యే గారు సూచించారు. నీటి నిల్వలు, పంపింగ్ వ్యవస్థ, పైప్‌లైన్ మరమ్మతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, నాయకులు గోకరి సురేష్ గౌడ్, పాపయ్య యాదవ్, సాయి మాలిక్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు హామీ ఇచ్చారు

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**విశాలభారతి, కరకగూడెం:**

మండలం కలవల నాగారం గ్రామానికి చెందిన భూక్యా రాందాస్ - విజయ దంపతుల కుమార్తె శ్రావ్య మరియు రవితేజ వివాహ వేడుకలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ , ఎర్ర సురేష్ , సర్పంచ్‌లు బట్టుపల్లి తోలెం రమాదేవి , కరకగూడెం పోలేబోయిన సుజాత , చిరుమల్ల కొమరం సుగుణ , వెంకటాపురం చౌలం కేశవరావు , చొప్పాల తోలెం సావిత్రి , గొల్లగుడెం ఎల్లబోయిన ముత్తమ్మ, కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య , ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు.





# పల్లెలోని సందళ్లన్నీ మీవే

'కోర్ట్' జోడీ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన వినోదాత్మక యువతరం సినిమా 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకుడు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 13న సినిమా విడుదల కానున్నది. గత శనివారం విడుదలైన ఈ సినిమాలోని తొలిపాట 'తిప్పకుంటన్నావ్..' సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ క్రమంలోనే ఈ శనివారం ఈ సినిమాలోని రెండోపాటను విడుదల చేశారు. 'పల్లెలోని సందళ్లన్నీ మీవే..' అంటూ సాగే ఈ మెలోడీ సాంగ్‌ని అగ్ర హీరో రవితేజ సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. చంద్రబోస్ రాసిన ఈ పాటను విజయ్ బుల్గానిన్ స్వరపరచగా, శ్వేతా మోహన్ ఆలపించారు. హీరోహీరోయిన్ల స్కూల్, చైల్డ్ మెమొరీస్‌ను గుర్తుచేసేలా ఈ పాట సాగింది. హర్ష్ రోషన్, శ్రీదేవి ఈ పాటలో స్కూల్ యూనిఫాంలో కనిపించారు. ఈ పాటలో వారి అల్లరి ఆడియన్స్‌ని మంత్రముగ్ధుల్ని చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సాయికుమార్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, నిర్మాణం: కోన ఫిల్మ్ కార్పొరేషన్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.